ప్రజాశక్తి

సోపతి

ఉత్తరం రాసి ఎన్నాళ్లయింది !

అక్టోబర్ 5, 2014 ఆదివారం అనుబంధం

ఆదివాసీ ఆత్మగౌరవ స్ఫూర్తి

- కొత్త సీరియల్
  ప్రేమ -విప్లవం
- యాకూబ్ కవితా విశ్లేషణ
- సిహెచ్ మధు, షేక్ కరీముల్లా కవితలు
- బర్మా కథ :
  నలుగురు యువకులు

చిత్రకళలో విప్లవాత్మక శైలి

"చిత్రకళకు జీవం పోసిన వాడిని నేను. ప్రకృతిలో ఏముందో నా చిత్రాలలోనూ అదే ప్రతిఫలిస్తుంది" అని సగర్వంగా చెప్పిన చిత్రకారుడు గియాట్టో. బైజాంటియన్ సంప్రదాయంపై తిరుగుబాటుగా ఇటలీలో వెల్లువెత్తిన చైతన్యానికి ప్రతీకలు గియాట్టో చిత్రాలు. ఇటలీలో ఒక పేద రైతు కుటుంబంలో 1267లో జన్మించారు. దాదాపు డెబ్బయి సంవత్సరాలు జీవించి, 8 జనవరి 1337లో ఈ లోకం నుంచి నిష్క్రమించారాయన. గియాట్టో కుడ్యచిత్రాలకు ఇటలీలో మంచి ఆదరణ వుంది. మధ్యయుగాల నాటి సంప్రదాయాలకీ, క్రైస్తవ సౌందర్యాత్మక అంశాలకీ సంబంధించిన చిత్రకళారీతుల్ని గియాట్టో బొమ్మలు చెబుతాయి. గియాట్టో వేసిన లాస్ట్ జడ్జిమెంట్ చిత్రం శతాబ్దాలు గడిచినా పురావైభవాన్ని కోల్పోకుండా నిలిచివుంది. మానవ ఉద్వేగాల్ని శరీరాలు ఎలా వ్యక్తం చేస్తాయో తన బొమ్మల ద్వారా తెలియజెప్పారు. 12, 13 శతాబ్దాల నాటి ఇటలీ ప్రజల చరిత్రను తెలుసుకోడానికి ఉపకరించే చిత్రాలివి. అప్పటివరకు వున్న సంప్రదాయరీతులపై తిరుగుబాటుగా సృజనకు పదునుపెట్టిన విప్లవాత్మక శైలి ఆయనది. కనుకనే తన తర్వాతి తరం చిత్రకారులకి స్ఫూర్తిగా నిలిచారు గియాట్టో.



■ అంతరంగం

చరిత్రకు సత్కారం

అమరత్వం అబద్ధం కాదు. అది సదా స్ఫూర్తిదాయకం. దీప్తిమంతం. పోరాటం నిత్యనూతన మార్గం. తనని తాను పునరావృతం చేసుకోవడం చరిత్ర స్వభావం. చరిత్ర విస్మరణకు గురువుతుందేమోగానీ పూర్తిగా మాసిపోదు. ఎందుకంటే చరిత్ర తిరుగులేని వాస్తవం. దానిని మార్చలేరు. ఏమార్చలేరు. కొన్నాళ్ళపాటు దాచే ప్రయత్నం చేయొచ్చు. కానీ దాచేస్తే దాగకపోవడం చరిత్ర లక్షణం. ఇది అనేక సందర్భాల్లో రుజువు అవుతున్న సత్యం. విస్మృతికి లోనయిన శక్తుల్నీ, వ్యక్తుల్నీ గుర్తించి గౌరవించే సంప్రదాయం కూడా చరిత్ర అలవరుస్తుంది. ఇది వర్తమాన తెలంగాణ చిత్రపటం మీద చూస్తున్నాం. తను ఒరిగిన నేల మీదనే తన చరిత్రను గానం చేయడం చరిత్రపై ఆవిష్కారమయ్యే అపూర్వదృశ్యం. ఏ నేల విముక్తి కోసమయితే అమరుడయ్యాడో ఆ నేల మీదనే ఆ వీరుని తలచుకోవడం ఆ నేలకీ, అక్కడి నివసించే వారికీ జరిగే సత్కారం. చారిత్రకశక్తుల చలనశీలతనే కొమురం భీం వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలన్న నిర్ణయానికి మూలం.

పురోగామి లక్షణం చరిత్రకు వుందని చెప్పడానికి జరుగుతున్న సంఘటనలే సాక్ష్యం. దీనిని ఆకళింపు చేసుకుంటూ అవగాహన ఏర్పరుచుకోవడం అవసరం. ఇందుకు చరిత్ర అధ్యయనం తప్పనిసరి. స్థానికతని భూమికగా చేసుకొని చరిత్రను వెలికితీసి నిర్మించే దృష్టి, అంతిమంగా చెమటని చిందించేవారి చరిత్ర రచనకు తోడ్పడుతుంది. చరిత్ర నిర్మాతలుగా నిలిచిన ప్రజల త్యాగాలను అర్థం చేసుకోడానికి ఉపకరిస్తుంది.

అందుకోసమే చరిత్రను రికార్డు చేయాలి. వందేళ్ళ కిందటి చరిత్ర కూడా లభ్యం కాని పరిస్థితి ఉండకూడదు. ప్రజల కోసం పోరాడిన వారి స్ఫూర్తిని గ్రహించడమే కాదు, ఏ నేపథ్యాల్నించి వారు ఎదిగివచ్చారో చెప్పగలిగే జీవితచరిత్రలు రూపొందించుకోవాలి. ఇది ఆయా కాలాల్లోని ప్రజల జీవితాన్ని కూడా రికార్డు చేస్తుంది. సామాన్యుల నుంచి చరిత్ర నిర్మితమవుతుందన్న సత్యానికి రుజువుగా నిలుస్తుంది. ఈవిధమైన చారిత్రకదృష్టిని సంతరించుకోవడం శ్రేయస్కరం.

ఇవాళ ఈ ప్రపంచంలో మానవ జీవితం ఈమాత్రమైనా సౌకర్యవంతంగా ఉండటానికి వెనుక వేలాది సంవత్సరాల మానవుల శ్రమ, త్యాగాలు దాగున్నాయి. ఈ అవగాహన భావితరాలకు అందించాలి. అందుకే ప్రాథమికమైన చారిత్రక అవగాహన పిల్లల్లో ప్రోది చేయాలి. దీనికి అనువుగా చరిత్ర అధ్యయనాన్ని ఒక మేరకయినా సిలబస్‌లో తప్పనిసరి చేయాలి. గతం లేకుండా వర్తమానం లేదు, భవిష్యత్తు లేదు. ఈ చారిత్రకదృష్టి మానవీయ స్వభావాన్ని సంతరింపజేస్తుంది. హృదయ సంస్కారాన్ని అలవరుస్తుంది. ఈ విశాలమైన ప్రపంచంలో మనిషిగా మసలుకోవడంలోనే మానవ జీవితానికి ధన్యత వుందని తెలియజేస్తుంది. కనుకనే చరిత్ర అధ్యయనం, చారిత్రక దృష్టి ప్రతి ఒక్కరికి అవసరం.

వెంటాడే వాక్యం ప్రతిరోజూ నీ జీవితంలో ఆఖరి రోజనుకుంటే నీ జీవితానికి గొప్ప మాంత్రిక లక్షణం అలవడుతుంది.

ప్రజాశక్తి

సోపతి

అక్టోబర్ 5, 2014

లేఖలు	4
చిట్కాలు కొంత సమయం ఉండాలి	5
కవర్‌స్టోరీ	
ఆదివాసీ ఆత్మగౌరవ స్ఫూర్తి	6
అనువాద కథ నలుగురు యువకులు	10
అలనాటి రచనలు	
మైనాదేవి	12
సంగీతం హాస్య వల్లరుల గీతమాలిక	13
నెమలీక	14
సీరియల్ ప్రేమ - విప్లవం	16
జ్ఞాపకాలు ఉత్తరం రాసి ఎన్నాళ్లయింది!	18
స్మరణ నటనకు జీవం పోసిన కన్నాంబ...	20
ఎరుక ధ్యానమంటే నదిలోకి దూకడమే...	21
నవరాగం	
నిలిచి వెలిగే ప్రేమకోసం అన్వేషణ	22
సోర్స్‌కోడ్ ఆన్‌లైన్ డేటాకు భద్రత కరువు	23
సమీక్షలు యాకూబ్ కవితా విశ్లేషణ	24
ఈ వారం కవిత్వం చలిలో...	26



నిజాం పాలకుల్ని సవాల్ చేసిన ఆదివాసీల ధిక్కార పతాక కోమురం భీం. ఈ నెల ఎనిమిదో తేదీన జోడెఘాట్‌లో జరుగుతున్న ఆయన వర్ధంతి సందర్భంగా అందిస్తున్న ముఖచిత్రకథనమిది.

లేఖలు

భారత్‌కే తలమానికం

ప్రజాశక్తి ఆదివారం సంచిక సోపతిలో కవర్‌స్టోరీ 'అంగారకుడిపై భారత్ తొలి అడుగు' వ్యాసం బాగుంది. మన దేశం అపారమైన మేధోశక్తికి నిలయం. భారత్ పంపించే వ్యోమనౌక అంగారకుడి కక్ష్యలోకి ప్రవేశించడం మన దేశ ప్రజలకు తీపి కబురు. ప్రపంచంలోని అగ్ర దేశాలతో పోలిస్తే మన దేశం కూడా శాస్త్ర సాంకేతిక రంగాలలో అద్భుతమైన విజయాలు సాధించి, ప్రగతి పథంలో ముందుకు దూసుకుపోతోంది. మంగళయాన్ ప్రయోగ లక్ష్యాల గురించి, వ్యోమనౌక సాధనాల గురించి వివరంగా తెలుసుకోడానికి ఈ వ్యాసం ఉపయోగపడింది. అంగారకుడిపైకి విజయవంతంగా ఉపగ్రహం పంపిన నాలుగో దేశంగా మన దేశం గుర్తింపబడడం గర్వకారణం.

– కామిడి సతీష్‌రెడ్డి, పరకాల, వరంగల్

విలువైన ఆణిముత్యాలు

ఈ వారం 'మంచి ముత్యాలు' శీర్షికలో వెలువడిన గొప్ప వ్యక్తుల అనుభవ భవంతులు ఎన్నటికీ నిర్మించలేని అక్షర స్రవంతులు. మరువరాని జీవన స్నేహకాంతులు. ఐన్‌స్టీన్, కన్‌ఫ్యూజియస్, థామస్ అబ్రహం వంటి ముగ్గురు మహనీయుల సూక్తులు ఎంతో ఉత్తేజాన్నిచ్చాయి. 'స్ఫూర్తినిచ్చిన ఉపాధ్యాయుడు' ద్వారా కొంతమంది అభిప్రాయాల వ్యక్తీకరణతో ఎంతో మంది ఉపాధ్యాయులు మరింత ఉత్సాహంగా బోధన చేయడానికి ఉపయోగపడుతుంది. 'నవరాగం'లో ప్రచురించిన జీవనోత్సవం బతుకమ్మ ద్వారా ప్రభుత్వ ఆలోచనలో మార్పు తెచ్చి, సమాజంలో ఒక్క మహిళకైనా న్యాయం చేసి మంత్రి వర్గంలో స్థానం కల్పించాలని మా మనవి.

– టి.వి.డి.ఎన్.సీతారామారావు, కొత్తగూడెం

అవసరాల మేరకే...

సోర్స్‌కోడ్‌లో ఫేస్‌బుక్‌పై వ్యాసం ఆకట్టుకుంది. ప్రస్తుతం ఇంటర్నెట్ అంటే ఏంటో తెలిసిన చాలామందికి ఫేస్‌బుక్ ఎకౌంట్లు ఉంటున్నాయి. వీటివల్ల ఒకరి అభిప్రాయాలు మరొకరితో పంచుకోవడమే కాదు, కొత్త సమాచారం తెలుసుకోడానికీ ఉపయోగపడుతుంది. సెల్‌ఫోన్ల టెక్నాలజీ పెరిగి స్మార్ట్ ఫోన్లు వచ్చాక ఫేస్‌బుక్ ఖాతాదారుల సంఖ్య మరింత పెరిగింది. వినియోగదారుల అభిప్రాయాలకు, అభిరుచులకు అనుగుణంగా ఇందులో మార్పులు చేయడం వల్ల ఫేస్‌బుక్ వాడేవారి సంఖ్య ఇంకా పెరుగుతున్నాయి. ఏదైనా అవసరాల మేరకు ఉపయోగించుకుంటే మేలు. అతి ఎప్పుడూ నష్టదాయకమే.

– వి.అశోక్, రాజాపూర్, మహబూబ్‌నగర్

కవితా ప్రపంచం

ఈ వారం కవిత్వం చదువుతుంటే కవితా ప్రపంచంలో ఓలలాడినట్లుంది. డా॥సి.నారాయణరెడ్డి, ఎన్.గోపి గారి కవితలు బాగున్నాయి. ప్రకృతిలో ఏదీ తన సహజత్వాన్ని కోల్పోదని, అస్తిత్వాన్ని రుజువుచేసుకుంటుందని సహజాతతత్వం చెప్తే, పక్షులమీది ప్రేమనంతా కదిలే కవితల్లో కనిపిస్తుంది.

– రాజారావు, వరంగల్

ఇద్దరూ సమానమైతేనే...

'అంతరంగం' వివరణ బాగుంది. ఈ వ్యాసం చదివి ఆచరించినవారికి నిజంగానే జన్మ సార్థకమౌతుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే ఎంతమంది దీన్ని ఒప్పుకుంటారనేది అసలు సందేహం. ఆడ అయినా మగ అయినా అహంకారం ఉంటే ఎప్పుడూ సంతోషపడలేరు. పితృస్వామ్యంలో సహజంగానే మగవారికి అధికారంతో వచ్చిన అహంకారం కొంతైనా ఉంటుంది. అది గ్రహించి నడుచుకుంటే ఆడామగా అనే తేడా లేకుండా అందరూ ఆనందంగా ఉండగలుగుతారు.

– లలితా ప్రియదర్శిని, హైదరాబాద్

మన జాతీయాలు

గడ్డి వాము కాడ కుక్క

గడ్డివాము దగ్గర యజమాని కుక్కను కావలి పెట్టాడు. కుక్క గడ్డి తినదు, ఇతరులను తిననీయదు, కచ్చితంగా కావలి ఉంటుంది. నిజాయితీగా యజమాని ఎడ విశ్వాసంతో తనకు అప్పగించిన బాధ్యత నెరవేరుస్తుంది. ప్రభుత్వాధికారులు కొందరు పదవి ఎడ విధేయతతో అవినీతికి పాల్పడకుండా ఇతరులను అవినీతికి పాల్పడనీయకుండా కర్తవ్యం నిర్వహిస్తుంటారు. వారు గడ్డి వాము కాడ కుక్క లాంటి వారు. ఎద్దేవగా, వెటకారంగా లంచగొండి ఉద్యోగులు ఈ జాతీయాన్ని ప్రయోగిస్తారు. "మీ అధికారి గడ్డివాము కాడి కుక్క. వాడు తినడు మమ్మల్ని తిననీయడు" అనటంలో ఈ జాతీయం ప్రయోగం వుంది.

జర్మనీ పిల్ల

రెండో ప్రపంచ యుద్ధకాలంలో తెలంగాణలో వచ్చిన విదేశీ వస్తువుల్లో ఎక్కువమొత్తం జర్మనీ దేశానికి చెందినవి. మంచి నాణ్యతతో కూడుకుని వుండేవి. ఆ వస్తువుల యెడ ప్రజలకు కూడా మంచి నమ్మకం వుండేది. నాణ్యత అనే దానికి ప్రతీకగా జర్మన్ వస్తువులను భావించేవారు. 'జర్మన్ మాల్' అని చెప్పేవారు. ఆ పద్ధతిలోనే అందంగా, ఆధునికంగా, సౌష్టవంగా ఉన్నవాళ్ళను 'జర్మన్ పిల్ల' అని ప్రశంసించేవారు. తరానికి మించిన చాకచక్యం కలవారిని జర్మన్ పిల్ల అని పిలవటం కద్దు. "దానికేంది జర్మన్ పిల్ల. మంచి మొగుడు దొరుకుతడు" అనటంలో ఈ జాతీయం వాడుతుండేవారు.

దబ్బనంతో దారం

సూది కన్న పెద్దది దబ్బనం. జనపనార సంచులు, బోరెములు కుట్టటానికి వాడుక ఎక్కువ. దబ్బనం ఒంటిగా వుంటే దాన్ని వెతికి పట్టుకోవటం ఇబ్బందిగా ఉంటుంది. అందుకని దారంతో కలిపే దాచిపెడతారు. దారం వల్ల దబ్బనం ఉనికిని పసిగట్టవచ్చు. తల్లితో పిల్ల లాంటి దానికి దగ్గర అనిపించినా తేడా వుంది. దారం వల్ల దబ్బనం దొరుకుతుంది. దారం లేకుండా దబ్బనంతో కుట్టేదేముండదు. దబ్బనం నిరుపయోగమవుతుంది. "చిన్న పోరన్ని కూడా వెంబడేసుకుపో, దబ్బనంతో దారం... దేనికన్నా అక్కరకు వస్తడు. నీ కింత చద్ది తెస్తడు. వానికింత పని అబ్బుతది. ఎందుకు వద్దంటావు" అనటంలో ఈ జాతీయం ప్రయోగాన్ని చూడవచ్చు.

– వేముల పెరుమాళ్ళు

■ **చిట్కాలు**

కొంత సమయం ఉండాలి

ప్రతి ఒక్కరికి వ్యక్తిగత సమయం (పర్సనల్ స్పేస్) ఎంతో అవసరం. అంటే ఒంటరిగా ఉండడమా అనే సందేహం రావచ్చు. ఒంటరిగా ఉండడం వేరు, ఏకాంతంగా ఉండడం వేరు. ఒంటరితనం అనేది చుట్టూ వందమంది ఉన్నా ఎవరిలో కలవకపోతే ఒంటరితనమే మిగులుతుంది. అది కేవలం మనసుకు సంబంధించింది. కానీ ఏకాంతమంటే మానసికంగానే కాదు, భౌతికంగా కూడా కొద్ది సమయం ఒంటరిగా గడపడం. దీనికోసం మన భౌతిక, మానసిక ప్రపంచాల్లో మనతో మనకు సమతౌల్యాన్ని పాటించాలి. ఇది చాలా సున్నితమైన విషయం. మనం మనలా ఉండగలగాలి. మరొకరి జోక్యం, ఇష్టాఇష్టాలతో నిమిత్తం లేకుండా స్వేచ్ఛగా ఉండడం. ఈ ఏకాంతం లేనప్పుడు నేడున్న బిజీ లైఫ్‌లో పని ఒత్తిడికి, ఆలోచనలకు చాలా తొందరగా అలసట వస్తుంది. దానితో మన చుట్టూ ఉన్నవాళ్ల మీద చిరాకులు, కోపాలు, అలకల వంటి ఎన్నో ఆటంకాలు మన జీవితంలోకి ప్రవేశిస్తాయి. వీటి వల్ల అటు వృత్తిలో నైపుణ్యం తగ్గిపోతుంది. వ్యక్తిగత సంతోషం దూరమవుతుంది.

ఎప్పటికప్పుడు పనుల ఒత్తిడి నుండి మనల్ని మనం దూరం చేసుకుంటూ ఉండాలి. లేదంటే ఆ ఒత్తిడిలో కూరుకుపోతాం. రోజువారీ జీవితం మనలో ఒత్తిళ్లను పెంచుతుంది. ప్రతి మనిషికీ పని చేయడంలో ఒక పరిమిత స్థాయి ఉంటుంది. అది దాటితే శక్తి నశించి, నీరసం రావడం ఖాయం. అయితే ఒత్తిడికి సంబంధించి పరిమితులు ఒక్కో వ్యక్తికి ఒక్కోలా ఉంటాయి. కొంతసేపు ప్రశాంతంగా గడిపితే సమయం వల్ల ఈ ఒత్తిళ్లను తట్టుకునే శక్తి లభిస్తుంది.

విశ్రాంతి, ప్రశాంతతత ఒకటి కాదు. మనం టెన్షన్‌తో ఉన్నప్పుడు చుట్టూ ప్రశాంత వాతావరణం ఉన్నా కూడా విశ్రాంతి పొందలేం. కొన్ని సార్లు చాలా రద్దీ ప్రదేశాల్లో కూడా ఎంతో విశ్రాంతిగా ఉన్నామన్న భావన కలుగుతుంది. ప్రశాంతత అనేది మెదడును, శరీరాన్ని తిరిగి శక్తివంతం చేస్తే, విశ్రాంతి మెదడుని, మనసుని ఉత్సాహపరుస్తుంది. విశ్రాంతి పొందడానికి ఎవరికి వారు కొంత పర్సనల్ స్పేస్‌ని ఏర్పరచుకోవాలి.

విశ్రాంతి పొందినవారు సంతోషంగా ఉంటారు. మనుషులమధ్య అంతర్గత సంబంధాలు మెరుగపడడానికి విశ్రాంతి ఎంతో ఉపయోగపడుతుంది. ఒత్తిడి కలిగించే ఆఫీస్ పని తర్వాత ప్రతి వ్యక్తీ కొంచెం విశ్రాంతి తీసుకోగలిగితే.. ప్రశాంతంగా ఉండగలుగుతారు.

వ్యక్తిత్వ వికాసంలో భాగంగా పర్సనల్ స్పేస్ ప్రాముఖ్యాన్ని ఎవరూ పట్టించుకోవట్లేదు. కానీ వ్యక్తిగత సమయం ఉంటేనే ఎవరైనా అయినా సరిగ్గా ఆలోచించగలుగుతారు. ప్రణాళికలు వేయడం, అభిరుచులు మెరుగుపరుచుకోవడం చేయగలుగుతారు. ఈ వ్యక్తిగత సమయాన్ని ఎవరికి వారు సృష్టించుకోవాల్సిందే. మరొకరు దాన్ని ఇవ్వలేరు, తీసుకోలేరు. అంతేకాకుండా దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కూడా ఎవరికి వారే తీసుకోవాలి.

దీనికోసం మీకు మాత్రమే ఉన్న ప్రైవేట్ ప్రదేశాన్ని ఎంచుకోండి. అది ఇంటికో ఆఫీసుకో దగ్గరి ప్రదేశమైనా కావచ్చు. లేదా ఇంట్లోని బాల్కనీ కూడా అవ్వొచ్చు. ఇంట్లోని ప్రదేశమైతే, మీరు ఆ ప్రదేశంలో కూర్చున్నప్పుడు ఇంట్లోని మిగతావారు మిమ్మల్ని ఆటంకపరచకూడదు అన్న విషయం వారికి ముందే తెలియజేయాలి. అప్పుడప్పుడు ఏకాంతంగా కూర్చోడం వల్ల కొత్త ఉత్సాహం వస్తుంది.

షికారుకో, విండో షాపింగ్ చేయడం వల్ల కూడా మంచి ఉత్సాహం వస్తుంది. అవసరం లేనివి కొనేకంటే కొత్త రకాలు మార్కెట్లోకి ఏమేం వచ్చాయో విండో షాపింగ్‌లో అలా అలా.. చూసి వస్తే చాలు మనసంతా ఉల్లాసంగా ఉంటుంది. కావాలంటే ఓ పూటంతా ఇలా విండో షాపింగ్‌లో గడపొచ్చు. అయితే ఇంట్లో వాళ్లకు చెప్పి వెళ్తే వాళ్లూ మీ పరిస్థితిని అర్థం చేసుకుంటారు. సహకరిస్తారు కూడా.

ఇంకా వ్యక్తిగత సమయాన్ని ఏర్పరచుకోడానికి దూర ప్రయాణాలు మంచి అవకాశం. ఇటువంటి సమయాల్లో మనకంటూ కొంత సమయాన్ని కేటాయించుకోవచ్చు. చుట్టూ వందమంది ఉన్నా ఎవరి ఆలోచనలు వారివి. ప్రయాణ సమయంలో కొంతసేపు తోటి ప్రయాణీకులతో మాట్లాడినా... మిగతా సమయమంతా సొంత ఆలోచనల కోసం ఉయోగించుకోవచ్చు. చుట్టూ ఉన్న పరిసరాలు గమనించడంలో మునిగిపోయినా కూడా కొత్త ఆలోచనలు వస్తుంటాయి.

ఏకాంతంగా కూర్చొని ఆలోచిస్తే భిన్నమైన ఆలోచనలు వస్తాయి. మనసుకు నచ్చిన పని చేసినా ప్రశాంతంగా ఉంటుంది. దానికోసం ఇలా కూడా చేయొచ్చు.. మీరు చదువుకునే వయసులో ఏర్పడిన సృజనాత్మకతను వెలికి తీయొచ్చు. చిత్రలేఖనం, ఎంబ్రాయిడరీ, రచనా వ్యాసంగం, తోటపని, పుస్తక పఠనం, టీవీ ప్రోగ్రాములు, ఆన్‌లైన్ గేమ్స్,

... ఇలాంటివి ఏవైనా గానీ.. మనసుకు నచ్చినది చేయడం వల్ల సంతోషం, ఉల్లాసం ఉంటుంది. లేదా ఇవన్నీ కాదు... నచ్చిన పాటలు... కొత్త పాటలు, ఓల్డ్ మెలొడీ, శాస్త్రీయ సంగీతం... ఏదైనా కానివ్వండి. సంగీతం వింటూ, కాఫీ లేదా టీ తాగుతూ మీకిష్టమైన విషయాల గురించి ఆలోచించండి. అసలు ఇవన్నీ కాదు... ఏ పనీ చేయకుండా, బద్ధకంగా మంచం మీద దొర్లుతూ పడుకోండి. ఆ తర్వాత రోజు మీకే తెలీకుండా రీఫ్రెష్ అవుతారు.

అయితే ఇవన్నీ చేయడంలో ఇతరులను అనుకరించడం, అనుసరించడం చేస్తే మాత్రం అది ప్రశాంతతని ఇవ్వదు. పైగా ఏదో కోల్పోయిన బాధ కలుగుతుంది. అయితే ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన విషయం మీ వ్యక్తిగత సమయాన్ని మీ మనసుకు నచ్చినట్లు గడపడంటే డబ్బు ఖర్చుతో కూడుకున్న పనైతే.. అది అస్సలు తృప్తినివ్వదు. పైగా ఇంట్లో అందర్నీ వదిలి ఇంత ఖర్చు పెట్టామే అన్న అపరాధ భావానికి గురిచేస్తుంది. ఏదైమైనా వ్యక్తిగత స్వేచ్ఛను నచ్చిన పద్ధతిలో, అనువైన విధానంలో గడపడం వల్ల సంతోషంతో పాటు కొత్త ఉత్సాహం వస్తాయి.

– అఖిల

■ కవర్ స్టోరీ

ఆదివాసీ ఉద్యమ స్ఫూర్తి

జల్, జంగల్, జమీన్

నిజాం పాలకుల నిరంకుశత్వానికి, దమననీతికి వ్యతిరేకంగా ఎదురు నిలిచిన సాహసి.
ఆదివాసీల హక్కుల కోసం ప్రాణాల్ని వదిలిన త్యాగశీలి.
అటవీ అధికారుల దౌర్జన్యాల్ని, నిజాం రాజ్య యంత్రాంగంలోని అధికారుల దుర్మార్గాల్ని ప్రతిఘటించిన ఉద్యమకేతనం.
నిజాం సైన్యాలకు వ్యతిరేకంగా గెరిల్లా పద్ధతిలో పోరాడిన ఆదివాసీ వీరుడు.
"మా ఊళ్ళో మా రాజ్యం" అంటూ గోండుల్ని స్వయంపాలనవైపు నడిపించేందుకు తుడుం మోగించిన సేనాని.
జల్, జంగల్, జమీన్ (నీరు, అడవి, భూమి) నినాదంతో ఆదివాసీల ఆత్మగౌరవం కోసం పోరాడిన యోధుడు కొమురం భీం.

తమ మానాన తాము పనిచేసుకుంటూ, భూముల్ని సాగు చేసుకుంటూ అడవుల్లో బతుకుతున్న గోండుల మీద పెత్తనం చేయబోయిన నిజాం రాజ్యపాలకుల్ని ప్రతిఘటించిన కొమురం భీం పోరాటం సదా స్ఫూర్తిదాయకం. భీం ఆశయాలు ఇంకా నెరవేరలేదు. అటవీ ఉత్పత్తులపై ఆదివాసీలకు హక్కులు లభించలేదు. భీం చనిపోయి 74 సంవత్సరాలవుతున్నా ఆయన ఆశయాలు సాకారం కాలేదు. వాటిని నెరవేర్చే దిశగా సాగే ప్రతి ఉద్యమానికి ఈ ఆదివాసీ యోధుని పోరాటం స్ఫూర్తి నిలుస్తుంది. గొప్ప ఉత్తేజాన్ని అందించే శక్తిగా కొమురం భీం స్మృతి ఉపకరిస్తుంది.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొమురం భీం వర్ధంతిని ఈ నెల ఎనిమిదో తేదీ పౌర్ణమినాడు నిర్వహిస్తుంది. అయితే ఆయన ఆశయాల్ని నెరవేర్చడమే సిసలైన నివాళి. అటవీ భూముల మీద ఆదివాసీలకు హక్కులు కల్పించడం, అన్నిరకాల పీడననుంచి విముక్తులయ్యేందుకు తోడ్పడటం ద్వారానే కొమురం భీంకు నిజమైన నివాళులు అర్పించినట్లవుతుంది.

నేపథ్యం

కొమురం భీం మీద సమగ్రమైన జీవితచరిత్ర ఇప్పటికీ రాలేదు.

అల్లం రాజయ్య, సాహులు రాసిన నవల 'కొమురం భీం' మాత్రమే అందుబాటులో వుంది. సాధికారికమైన జీవితచరిత్ర రావాల్సివుంది. ఆదివాసీల్లో గోండు తెగకు చెందిన కొమురం భీం ఆదిలాబాద్ జిల్లా ఆసిఫాబాద్‌లోని సంకెనపల్లి గ్రామంలో కొమురం చిన్నూ, సోంబాయి దంపతులకు 1900 సంవత్సరంలో జన్మించాడు (పుట్టినరోజు, పుట్టిన సంవత్సరం కచ్చితంగా నిర్ధారితం కాలేదు). అతని పదిహేడేళ్ళ వయసులో అటవీశాఖ సిబ్బంది దాడిలో తండ్రి చనిపోయాడు. దీనితో భీం కుటుంబం కెరిమేరి మండలం సర్దాపూర్‌కు వలస వెళ్ళింది. అక్కడే వ్యవసాయం చేసుకుంటూ బతుకుతున్న సమయంలో నిజాం అనుయాయుడు సిద్దిఖీ అనే జాగీర్దారు భీం సాగు చేసుకుంటున్న భూమిని ఆక్రమించాడు. గోండులతో వెట్టిచాకిరీ చేయించాడు. దానితో భీం అంతులేని కోపంతో సిద్దిఖీని హత్యచేశాడు. తర్వాత నిజాం పోలీసులకు చిక్కకుండా చంద్రాపూర్ మీదుగా అస్సాం వెళ్ళిపోయాడు. అక్కడే అయిదేళ్ళపాటు ప్రత్తి, కాఫీ, తేయాకు తోటల్లో కూలీ పనిచేశాడు. అక్కడే చదవడం, రాయడం నేర్చుకున్నాడు. మరాఠీ, ఉర్దూ భాషలు నేర్చుకున్నాడు. అయిదేళ్ళ తర్వాత తిరిగి భీం తల్లి నివాసం వుంటున్న కాకన్‌ఘాట్‌కు తిరిగి వచ్చాడు. ఆ గ్రామంలోని సోంబాయితో పెళ్ళి జరిగింది.

ఉద్యమ ప్రస్థానం

అస్సాంలో వుండగానే స్వాతంత్ర్యం కోసం అల్లూరి సీతారామరాజు పోరాటాన్ని గురించి, బీహార్‌లో ఆదివాసుల స్వేచ్ఛకోసం బిర్సాముండా పోరాటాన్ని గురించి విన్నాడు. వారి పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని తమ గోండులను అన్నిరకాల పీడననుంచి విముక్తి కల్పించాలని సంకల్పించాడు. ఆ కాలంలో అరకకు ఐదు రూపాయలు, పోడుకు రెండు రూపాయలు చొప్పున ఆసిఫాబాద్ తహసిల్దార్‌కు పన్ను చెల్లించేవారు. కొమురం భీం అప్పటి ఆసిఫాబాద్ తహసిల్దార్‌తో మాట్లాడి లచ్చువకు చెందిన పన్నెండు ఎకరాల భూమి కేసును కొట్టేయించాడు. అప్పటినుంచి ఆ ప్రాంత ఆదివాసీలందరికీ భీం నాయకుడయ్యాడు. ఈ క్రమంలో 60 ఎకరాల అడవిని నరికి 12 గ్రామాలను ఏర్పరిచాడని చెబుతారు.

ఆసిఫాబాద్ పరిసర ప్రాంతాల్లోని జోడేఘాట్, పట్నాపూర్, బాబేఝరీ, టోకెన్నావాడ, చల్‌బరిడి, శివగూడ, భీమన్ గొంది, కల్లెగావ్, అంకుశాపూర్, నర్సాపూర్, కోశగూడ, దేవునిగూడ అనే 12 గ్రామాల యువకులతో భూపోరాటానికి సిద్ధమయ్యాడు కొమురం భీం. గోండు, కోయ యువకులతో గెరిల్లా సైన్యం ఏర్పాటు చేశాడు. ఈ గ్రామాలను



దర్శనీయ స్థలి జోడేఘాట్

కొమురం భీం అమరుడయిన జోడేఘాట్ పోరాటకారులకు, అణచివేతకు వ్యతిరేకంగా పోరాడేవారందరికీ సందర్శనీయ స్థలి. ప్రాంతీయ చైతన్యం పెరిగిన నేపథ్యంలో జోడేఘాట్‌ను సందర్శించి భీంకు నివాళులు అర్పించడం ఇనుమడించింది. ఉట్నూరు నుండి 70 కిలో మీటర్ల దూరంలో ఉండే చోటది. ఉట్నూరు డివిజన్‌లో ఉన్న కెరమెరి మండంలో ఉంది. హట్టి నుండి సుమారు 20 కిలో మీటర్లుండే జోడేఘాట్‌కు ఇప్పటికి పక్కా రోడ్డు సౌకర్యం లేదు. వేలాదిగా తరలివచ్చే జనజాతర అది. ప్రముఖ ఆంత్రపాలోజిస్టు హెమాన్‌డార్ఫ్ ఇక్కడి వారి జీవితాల్ని పరిశీలించి, ఆదివాసుల సమస్యలను

పరిష్కరించాలంటే ఇక్కడ దర్బారును ఏర్పాటు చేసి ముఖాముఖంగా వారి సమస్యలను పరిష్కరించాలని సూచనలు చేశారు. అది కొంతకాలం సజావుగా జరిగింది. అపరిష్కృత సమస్యలు పెరగడంతో ఆదివాసీ నాయకులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. భద్రత కారణంగా ఆయన వర్ధంతి కార్యక్రమాలను హట్టి వరకే పరిమితం చేశారు. ఈ సారైనా జోడేఘాట్‌లో నిర్వహించాలని నాయకులు కోరుతున్నారు.ఈ నేపథ్యంలో ప్రభుత్వమే కొమురం భీం వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించడం పట్ల ఈ ప్రాంతవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఒకనాడు ఉట్నూరు పరిసర ప్రాంతాలకే పరిమితమైన భీమ్ విగ్రహాలు జిల్లా అంతటికి విస్తరించాయి. హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ పై భీమ్ విగ్రహం ఆదివాసి పోరాటాలకు సంకేతమై నిలిచింది. తొలుత భీమ్ విగ్రహాన్ని తయారు చేసిందిక ఆదిలాబాద్‌లోని రవీంద్రశర్మ. కొమురం భీం సంబంధీకుల ద్వారా ఆయన రూపురేఖల్ని తెలుసుకొని భీం విగ్రహాన్ని రూపొందించారు. ఆ విగ్రహ నమూనానే ఇప్పడు అందరూ అనుసరిస్తున్నారు.

సాహిత్యంలో కొమురం భీం

మొదటి సారిగా అల్లం రాజయ్య, సాహులు కలిసి 'కొమురం భీం' నవలను రాశారు. సాహితీ పరమైన రచనలు కూడా ఆయనపై రావటంతో పాటుగా, ఉట్నూరు ఐటిడిఎ ఆధ్వర్యంలో నిర్మించిన భీం సినిమా కూడా ఆయన జీవితంపై వెలువడింది. సినిమాలో నటించిన భూపాల్ పిల్లల కోసం భీం నవలను రాశారు. ఇంకా ఆ సినిమాకు పని చేసిన ప్రాణ్‌రావు కూడా నవల రాశారు. వసంతరావు దేశ్‌పాండే రాసిన 'అడవి' నవలలో కూడా భీం జీవిత నేపథ్యాన్ని సృజించారు. జిల్లాలో జర్నలిస్టుగా పని చేసిన పులుగు శ్రీనివాస్ భీం భార్య ఐనా సోం బాయి జీవిత నేపథ్యం ఆధారంగా 'అడవితల్లి' నవల రాశారు. ఇది 'మదర్ ఫారెస్ట్' అనే పేరుతో ఇంగ్లీషులోకి అనువాదమైంది. అదిలాబాద్ ప్రాంత ఆదివాసి జీవన సమరానికి నిదర్శనాలివి. భీమ్ ఆధారంగా వచ్చిన సాహిత్యమిది. 'కొమురం భీం' నవల రాయడానికి సాహూ, అల్లం రాజయ్య ఎంతో పరిశోధన చేశారు. సమాచారం సేకరించారు. అయితే నవలగా రాశారే తప్ప జీవితచరిత్ర రాయలేదు. ఆ నడుమ ప్రముఖ జానపద పరిశోధకుడు, కవి జయధీర్ తిరుమలరావు గారు తన పరిశోధనలో భాగంగా భీమ్ ఆధికారిక రిపోర్టును సంపాదించారు. దాంతో ఇంకొన్ని విషయాలు వెలుగులోకి వచ్చాయి. కనుక కొమురం భీమ్ మీద సమగ్రమైన జీవితచరిత్ర రావాలి. ఆయన చనిపోయి 74 ఏళ్ళు మాత్రమే. కొన్నేళ్ళ కిందటి వరకు భీం భార్య సోంబాయి జీవించి వున్నారు. కొమురం భీం చిత్ర కథా రచయిత ఎస్.ఎమ్.ప్రాణ్‌రావు ఆమెను కలిశారు. మాట్లాడారు.

తొలుత కొమురం భీంపై ఒక డాక్యుమెంటరీ నిర్మించాలని తలపెట్టిన అల్లాణ్ణి శ్రీధర్ దానిని ఒక సినిమాగా తీయడం భీం పోరాట ప్రత్యేకత తెలుసుకోవడం వల్లనే. ఆ సినిమా ఇప్పుడు మరోసారి తెలంగాణ ప్రేక్షకుల ముందుకు రావాలి. ఆ సినిమాలో భీం పాత్రను పోషించిన భూపాల్ నిరంతరం ప్రజల పక్షాన నిలిచి రచనలు చేస్తున్నారు. ఇక ఈ నడుమ చాలామంది కవులు భీం ప్రత్యేకతను తమ కవితల్లో చెప్పుకొచ్చారు. 'నిత్య గాయాల నది' కథలో బెజ్జారపు రవీందర్ కొమురం భీం ప్రస్తావనని సముచితమైన రీతిలో తీసుకొచ్చారు. అల్లూరి సీతారామరాజు గురించి తెలిసిన వారికి కొమురం భీం పేరు తెలియకపోవడం వెనుక గల కారణాల్ని అన్వేషించాలన్న సూచన వుంది ఆ కథలో. అయితే సామల సదాశివ గారు మొట్టమొదటిసారి కొమురం భీం గురించి పాఠ్యాంశం రాశారు. 1982లో ఏడవ తరగతి తెలుగు పాఠ్యపుస్తకంలో భీమ్ గూర్చిన పాఠం పెట్టించడంలో ప్రముఖ పాత్రను పోషించారు. నిరాదరణకు గురైన ఆదివాసి పోరాటయోధుని చరిత్రకు సిలబస్‌లో స్థానం కల్పించారు. అయితే తర్వాత కాలాన ఇది కొనసాగలేదు. అందువల్లనే కొమురం భీం గురించి పిల్లలకు తెలియకుండా అయ్యింది. ఇప్పుడు తిరిగి కొమురం భీం జీవితాన్ని ఈతరం పిల్లలకు సగౌరవంగా తెలియజెప్పేందుకు సిలబస్‌లో స్థానం కల్పించాలి.

భీం పాత్ర పోషించిన భూపాల్

అల్లాణ్ణి శ్రీధర్



సదాశివ

వసంతరావు దేశ్‌పాండే

అల్లం రాజయ్య

బెజ్జారపు రవీందర్

గోండుల స్వతంత్రరాజ్యంగా ప్రకటించుకోడానికి ప్రణాళికను సిద్ధం చేశాడు.

పూర్వరంగం

స్వతంత్ర గోండురాజ్యం ప్రకటించుకోవాలనే ఆలోచనలకు నిజాం రాజ్యంలో ఆదివాసీల మీ జరిగిన అణచివేతనే ప్రధాన కారణం. అడవుల్లో జీవించే ఆదివాసీలకు అటవీ ఉత్పత్తుల మీద హక్కులు లేకుండా చేసింది నిజాం అధికార గణం. గిరిజనులు పోడు చేసుకుంటున్న భూములకు పన్ను కట్టాల్సిన పనిలేదని కోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ అధికారుల వేధింపులు తప్పలేదు. అడవుల్లో ఆదివాసీలు స్వేచ్ఛగా తిరిగే పరిస్థితిలేదు. అటవీ అధికారులు, సిబ్బంది తరచుగా గోండుల్ని, కోయల్ని వేధించేవారు. దాడి చేసేవారు. తమ భూమి మీద, తమ అడవి మీద అధికారుల దౌర్జన్యం ఏమిటనే ఆందోళన, నిరసనలు ఉద్యమరూపం దాల్చాయి. కనుకననే 'జల్, జంగల్, జమీన్' నినాదంతో ఆదివాసీలను ఏకం చేశాడు భీం.

దాడులకు వెరవని దళాలు

భీం పోరాటాన్ని నీరు గార్చడం కోసం తొలుత భీం ఇంటి మీద దాడి చేశారు. సోదాల పేరుతో వచ్చి గాలింపు జరిపారు. కానీ భీం మీద కేసు పెట్టడానికి ఎలాంటి ఆధారం దొరకలేదు. కానీ దౌర్జన్యం చేయడానికి ప్రయత్నించడంతో భీం, ఇతర యువకులు ఎదురు తిరిగారు. పోలీసుల్ని కొట్టి పంపించారు. దీనితో కొమురం భీంకీ, నిజాం రాజ్య యంత్రాంగానికీ నడుమ అసలు పోరు ప్రారంభమైంది.

భీం పోరాటాన్ని అణచివేయడానికి అతని దగ్గర పనిచేసిన కొమురం సూరును, లచ్చుపటేల్‌ను నిర్బంధించారు. సాధారణ గిరిజనులను సైతం అరెస్టు చేసి జైల్లో పెట్టారు. గోండుల గూడేల మీద నిజాం పోలీసులు దాడులకు పాల్పడ్డారు. ఈ దాడుల్ని తిప్పి కొట్టడానికి గెరిల్లా సైన్యం ఏర్పాటు చేశాడు భీం. నిజాం సర్కార్ పోలీసు దళాల దాడుల్ని ప్రతిఘటించాడు. కొన్ని దాడుల్లో నిజాం పోలీసులను తరిమిగొట్టాయి భీం సేనలు. దీనితో కొమురం భీంతో సంప్రదింపులకు దిగివచ్చిన నిజాం ప్రభుత్వ ప్రతినిధులతో గోండుల స్వతంత్ర రాజ్యాన్ని నిజాం ప్రభుత్వం గుర్తిం చాలన్న డిమాండ్ ముందు పెట్టాడు. ఆదివాసీ గూడేలకు పూర్తి స్వయం ప్రతిపత్తి, స్వేచ్ఛను ఇవ్వాలని కోరాడు. కానీ ఈ షర తుల్ని, డిమాండ్లను నిజాం ప్రభుత్వం తిరస్క రించింది. అతని స్థావరాలపై, రాకపోకలపై నిఘా పెంచింది. పోలీసుల, సైనికుల అణచివేత కార్య కలాపాల్ని పెంచింది. భీం దగ్గర వున్నవారిని లొంగ దీయా లని ప్రయత్నించింది. ఈ క్రమంలో నిజాం

పోలీసుల దాడుల్ని గెరిల్లా పద్ధతుల్లో కొమురం భీం ప్రతిఘటిస్తూ వచ్చారు. అయితే కుర్దు పటేల్ అనే నమ్మకద్రోహి సమాచారంతో భీం స్థావరాల్ని నిజాం పోలీసు మూకల పౌర్ణమినాటి అర్ధరాత్రి చుట్టుముట్టాయి. ప్రతిఘటించిన భీంను, భీంతో పాటు వున్న గెరిల్లా దళాల్ని కాల్చి చంపాయి. 1940 సెప్టెంబర్ 1న భీం మరణించారు. తిథి ప్రకారం ఆ రోజు అశ్వీయుజ శుద్ధ పౌర్ణమి అవుతుంది. కనుక ప్రతి ఏటా పౌర్ణమి నాడు కొమురం భీం వర్ధంతి జరుపుతున్నారు.

ఆదివాసీ పోరాటాల స్ఫూర్తిగా వున్నందున కొమురం భీం వర్ధంతి కూడా పాలకులకు మింగుడుపడటం లేదు. కనుకనే నిన్నమొన్నటి వరకు జోడెఘాట్‌లో కొమురం భీం వర్ధంతిని నిర్వహించేందుకు అనేకానేక ఆంక్షలుండేవి. కానీ ఇవాళ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్వయంగా అధికారికంగా జరప నిశ్చయించడం గమనార్హం.

చెదరని ఉద్యమదీప్తి

ఏడు దశాబ్దాల కిందట భీంని హతమార్చినప్పటికీ ఆయన వెలిగించిన పోరాటస్ఫూర్తి చెదిరిపోలేదు. అది ఆదివాసీల నిరంతర ఉద్యమ దీప్తికి చమురుగా పనిచేస్తూనే వుంది. ఒక సాధారణమైన మనిషి అసాధారణమైన మానవుడుగా రూపాంతరం చెందడం వెనుక చారిత్రక, సామాజికశక్తులు పోషించే భూమిక కీలకమైంది. అందుకు భీం జీవితగమనమే దాఖలా. సామాజిక పరిస్థితుల్లోంచే చరిత్రనిర్మాతలు పుడతారనడానికి ఉదాహరణగా నిలిచే మనీషి కొమురం భీం. అందుకే భీంను స్మరించుకోవాలి. తలచుకోవాలి. కనుకనే స్వరాష్ట్రమైన తెలంగాణలో తొలిసారిగా వచ్చిన భీం వర్ధంతిని రాష్ట్ర పండుగగా జరుపుకోవాలని తీసుకున్న నిర్ణయం హర్షణీయమైంది. ఊరువాడ ఏకమై భీమ్‌కు నివాళులు అర్పించటమంటే మన వాళ్ళను మనం సత్కరించడం. అలనాటి చరిత్రను గుర్తించి గౌరవించడం.

నెరవేరాల్సిన ఆశయాలు

కొమురం భీం ఏ ఆశయాల కోసం పోరాడారో అవి ఇంకా సాకారం కాలేదు. అడవి మీద, అటవీ భూముల మీద ఆదివాసీలకు సంపూర్ణమైన హక్కులు లభించలేదు. కనుక వివిధ రూపాల్లో తమ డిమాండ్ల సాధనకు ఆదివాసులు పోరాడుతున్నారు. ఆ పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచే ఐకాన్ అయ్యారు భీం. అతని సాహసం, పోరాటం కొత్తశక్తుల ఆవిర్భావానికి దారితీసింది. చరిత్రక్రమంలో ఒకదశన భీం కనుమరుగయ్యాడు. కానీ చరిత్ర నిర్మాతల్ని చరిత్ర విస్మరించదనే సంగతి ప్రతి సందర్భంలోనూ రుజువు అవుతుంది. ఈ నేపథ్యంలోనే తెలంగాణ నేల మీద ఆదివాసీ పోరాటయోధుల్లో అగ్రగామిగా నిలిచిన భీంని ఇవాళ స్మరించుకునే సన్నివేశం ఆవిష్కృతమయింది. వీరుల త్యాగాల్ని గుర్తించడమంటే వారి పేర్లను తలవడమే కాదు, వారి ఆశయాలను సాకారం చేయడం. ఇందుకు తగిన దిశానిర్దేశం అందించే విధంగా ఆదివాసీ ఉద్యమాలు క్రియాశీలం కావాలి. సంఘటితశక్తిగా నిలిచి అన్నిరకాల పీడనల్నించి ఆదివాసీల విముక్తికి కీలకమైన భూమికగా నిలవాలి. ఇదే కొమురం భీంకు అర్పించే నిజమైన నివాళి.

– గోపగాని రవీందర్, 9440979882

■ అనువాద కథ : కనకదుర్గా రామచంద్రన్

నలుగురు యువకులు

బర్మాదేశంలో ఒక చిన్న పల్లెటూళ్ళో నలుగురు యువకులుండేవాళ్లు. వాళ్లు చిత్రవిత్రమైన, నమ్మటానికి వీలులేని కథలు అల్లి చెప్పటంలో చాలా తెలివిగలవాళ్లు.

ఒకనాడు, ఆగ్రామం వెలుపలగల సత్రంలోకి, అందమైన విలువగల దుస్తులువేసుకున్న ఒక ప్రయాణికుడు కాసేపు విశ్రాంతి తీసుకుపోదామని వచ్చాడు. ఈ సంగతి నలుగురు యువకులు గమనించారు. వీళ్లు నలుగురూ ఎట్లాగైనా ఆ ప్రయాణికుని విలువైన దుస్తులను కాజేయ్యాలని పన్నాగం పన్నారు. సత్రంలోకి వెళ్ళి ఆ ప్రయాణికుడు వినేటట్లు వాళ్ళలో వాళ్ళే ఏదో వాదించుకోవటం మొదలుపెట్టారు.

కొంతసేపు అయ్యాక, ఆ నలుగురిలో ఒకడు మనం కథలు చెప్పటంలో పందెం వేసుకుందామన్నాడు, ఆ పోటికి కొన్ని షరతులు ఏర్పాటు చేసుకున్నారు. అక్కడ వున్న వాళ్ళందరు తమ అద్భుతమైన అనుభవాల్ని చెప్పాలి. అలా చెపుతున్నప్పుడు, ఇంకోకడెవడైనా ఆ కథ నిజంకాదని సందేహిస్తే వాడు ఆ కథ చెప్పినవాడికి బానిస అయిపోవాలి, అనుకున్నారు. ఆ ప్రయాణికుడు కూడా ఈ పోటీకి ఒప్పుకున్నాడు. అందరూ కలిసి సరేనంటే సరే అనుకున్నారు. ప్రయాణికుడు వట్టి తెలివిలేని దద్దమ్మలాగున్నాడే అని నలుగురూ ముసి ముసి నవ్వులు నవ్వుకున్నారు. ఎందుకంటే, వాళ్ళు చెప్పబోయే కథలు ఎవరూ నమ్మటానికి వీలులేనివని వాళ్ళకు తెలుసు. అంచేత ఆ ప్రయాణికుడు తమకిమల్లే, అలాంటి కల్ల బొల్లి కథలు చెప్పలేనివాడు అయివుంటాడు అనుకున్నారు. ఎట్లాగైతేనేం, ప్రయాణికుని విలువైన బట్టలను సులభంగా కొట్టెయ్యవచ్చునని లోలోపల సంతోష పడుతున్నారు. అతడు ఆ పోటీలో ఓడిపోతాడు, జయించిన తమకు బానిసైపోతాడని అనుకున్నారు. అప్పుడు బానిసకు చెందినవన్నీ జయించిన వాళ్ళకి స్వాధీనం అయిపోతాయి గదా అని, ఆ యువకులు నలుగురూ ఈ పన్నాగం పన్నారు. వెంటనే ఆ ఊళ్లోకి వెళ్ళి, ఆ ఊరి పెద్దని ఈ కథల పోటీలో న్యాయం చెప్పే పెద్దమనిషిగా పిలుచుకొచ్చారు.

మొదటి యువకుడు తన అద్భుతమైన కథ ప్రారంభించి ఇట్లా చెప్పుకొచ్చాడు.

"నేను పుట్టటానికి ముందు, మా అమ్మ మా నాన్నని మా ఇంటిముందర రేగిచెట్టు ఎక్కి, పళ్ళు కోసి ఇవ్వమని ఆడిగింది. ఆ రేగిచెట్టు చాలా ఎత్తుగా, పెద్దదిగా ఉండటం మూలాన, మా నాన్న ఎక్కలేక పోయాడు. తరువాత మా అమ్మ రేగిపళ్ళు కోసి ఇవ్వమని మా తమ్ముళ్ళని అడిగింది. వాళ్ళు కూడా ఆ చెట్టెక్కి రేగిపళ్ళను మేము కోయలేమమ్మా! అన్నారు. మా తల్లి ఆశాభంగం చెందటం నేనెంత మాత్రం సహించలేకపోయాను. ఎవ్వరూ చూడని సమయం కనిపెట్టి, నేనే చెట్టెక్కి, రేగిపళ్ళన్నీ కోశాను. వాటిని వంటింట్లోకి తీసుకెళ్ళి గప్‌చిప్‌గా పెట్టేశాను. ఆ రేగిపళ్ళు ఎక్కడినించి వచ్చాయో, ఎవరు వంటింట్లో పెట్టారో ఎవరికీ తెలియదు. అయితే మా అమ్మ మాత్రం చాలా సంతోషించింది," అని చెప్పితన కథ ముగించాడు.

కథంతా చెప్పిన తరువాత మొదటి యువకుడు ప్రయాణికుని ముఖం తేరిపార చేశాడు. తన కథ సరిగ్గా లేదని అతడు సందేహిస్తాడేమో అనుకున్నాడు. కానీ అతను కథ బాగుందన్నట్లు తల ఊపేటప్పటికి, తక్కిన ముగ్గురూ యువకులు కూడా అతనితోపాటు తలలూపారు.

ఇంక రెండవ యువకుడు తన కథ మొదలుపెట్టాడు:– "నేను పుట్టిన వారంరోజులకు, అడవిలో నడచిపోతుండగా పండిన పళ్ళతో నిండిన ఒక ఖర్జూరపుచెట్టు కనిపించింది. నాకు చాలా ఆకలేసింది. త్వరగా చెట్టెక్కి పొట్ట పగిలేట్టు ఖర్జూరపు పళ్లన్నీ బాగా తిన్నాను. తినేసరికి బద్ధకం, మందకోడితనం ఎక్కువై నిద్రమత్తు వచ్చేసింది. చెట్టు దిగలేకపోయాను. ఆ ఊళ్లోకి వెళ్ళి ఒక నిచ్చెన తెచ్చి, దానిని చెట్టుకు ఆధారంగాపెట్టి ఎల్లాగో నిచ్చెన మెట్లమీదుగా మెల్లగా కిందకి దిగాను. నాకే గనుక ఆ నిచ్చెన దొరక్కపోతే నేను ఇంకా ఇప్పటిదాకా ఆ ఖర్జూరపు చెట్టుమీదే వుండిపోయే వాడిని," అని తన అద్భుతమైన కథ పూర్తి చేశాడు. ప్రయాణికుడి వైపు చూశాడు. అతడు ఈ కథని ఎంత మాత్రం నమ్మడనుకున్నాడు. కాని, ఆ ప్రయాణికుడు కథ బాగుందన్నట్లు తల ఊపాడు. తక్కిన ముగ్గురూ

అతనిలాగే తలలూపారు.

ఇప్పుడు మూడవ యువకుడు తన కథ ప్రారంభించాడు :– "నేను పుట్టిన ఏడాదికే బాగా ఎదిగి ముసలివాడినై పోయాను. ఒక కుందేలు ఎత్తుగా పెరిగి ఉన్న గడ్డిలోకి గబగబా పరుగెత్తటం చేశాను. నేను దాన్ని తరుముకు పోయాను, తీరా దగ్గరికి వెళ్ళి చూద్దునుగదా! నేను తరుముకు వచ్చిన జంతువు కుందేలు కాదు. భయంకరమైన పులి. నన్నుచూడగానే ఆ పులి నన్ను మింగెయ్యటానికి అమాంతంగా నోరు తెరిచింది. నన్ను మింగవద్దని, నేను నిర్దోషినని, నన్ను మింగటం ధర్మంకాదని, ఎన్నో విధాల ఆ పులితో మొరబెట్టుకున్నాను. నేను కుందేలుకోసం వెతుకుతుండగా, తలవని తలంపుగా పులి ఎదురైందని, కాబట్టి నన్ను వదిలివేయమని మరీ, మరీ వేడుకున్నాను. నా మాటలు పులి పెడచెవిన పెట్టింది. నా ప్రయత్నమంతా బూడిదలో పోసిన పన్నీరయింది. పులి ఇంకా నోరు పెద్దగా తెరచుకొని, నన్ను మింగటానికి చూస్తూ, గాండ్రిస్తూనే ఉంది. నాకు పట్టలేనంత కోపం వచ్చింది. పులి క్రూరత్వాన్ని చూపేటప్పటికి మరీ వళ్లూపై తెలియకుండా పోయింది, ఇంకేముందీ! ఒక్కపెట్టున వీరాధివీరుడిలాగా, ఆ పులిని ఎడమచేతితో పట్టుకొని రెండు చీలికలుగా చీల్చిపారేశాను," అని కథ పూర్తి చేశాడు.

ఈ కథ చెప్పిన మూడవ యువకుడు తన వీరగాథను విన్న ప్రయాణికుడు తన కట్టు కథను ఏ మాత్రం నమ్మడనుకున్నాడు. కాని, ఆ ప్రయాణికుడు కథ బాగుందన్నట్లు తల ఊపాడు.

ఇది చూసి నాలుగో యువకుడు తన కథ మొదలుపెట్టాడు:– "పోయిన సంవత్సరం, నేను సరదాగా చేపలు పట్టటానికని పడవలో బయలుదేరి వెళ్ళాను. అయితే పేరుకైనా ఒక్కచేపని కూడా పట్టలేకపోయాను. తక్కిన చేపలవాళ్ళని అడిగితే, వాళ్ళకు కూడా ఒక్క చేపైనా దొరకలేదు. 'మా గతీ అంతే అయింది,' అన్నారు. చేపలు దొరక్కపోవటానికి కారణం కనుక్కోవాలని పట్టుపట్టాను. వెంటనే ఆ నదిలో దూకి, ఈదుకుంటూ బాగా లోతుకి వెళ్ళిపోయాను. నది అడుక్కి వెళ్ళేటప్పటికి, అమ్మయ్యో కొండంత పెద్ద చేప కనబడింది. ఈ పెద్ద చేపే, తక్కిన చిన్న చేపలన్నింటిని స్వాహాచేస్తూందని కనిపెట్టేశాను. అందుకనే మా కెవ్వరికి ఒక్కచేపైనా దొరకలేదు అనుకున్నాను. నాకు తగని కోపం వచ్చేసింది. ఆ కొండంత చేపను నా పిడికిలితో గట్టిగా ఒక్క గుద్దు గుద్ది చంపిపారేశాను. ఇంత కష్టపడి దాన్ని చంపేటప్పటికి చాలా అలసిపోయాను. చెప్పలేనంత ఆకలి వేసేసింది. అక్కడే ఆ పెద్దచేపను తినెయ్యాలనుకున్నాను. వెంటనే చిన్న మంట వేసి, చేపను బాగా కాల్చి, ఆ కమ్మని చేపని కాస్తకూడా మిగల్చకుండా, అంతా నేనే తృప్తిగా తినేశాను. మళ్ళీ నా పడవెక్కి హాయిగా ఇల్లు చేరుకున్నాను," అని కథ ముగించాడు నాలుగవ యువకుడు. తన వింత కథ విని ఆ ప్రయాణికుడు తప్పక నవ్వుతాడని, ఇది నమ్మతగిన కథ కాదంటాడనీ అనుకున్నాడు. కాని, ఆ ప్రయాణికుడు మామూలుగా కథ బాగానే ఉందన్నట్లు తలూపేశాడు. తక్కిన వారు కూడా తలలూపేశారు.

చిట్టచివరికి, ఆ ప్రయాణికుడు తన కథ చెప్పవలసి వచ్చింది, ఆతడు తన విచిత్ర కథ మొదటు పెట్టాడు.

"కొన్ని ఏళ్ళ క్రిందట నాకు వ్యవసాయం చేసుకోటానికి ఒక పొలముండేది. ఆ పొలంలో ఒక పళ్ళచెట్టుండేది. అయితే, అది చాలా చిత్రమైన చెట్టు. దానికి నాలుగు కొమ్మలు మాత్రముండేవి. ఆకులు అసలే లేవు. ప్రతి కొమ్మ చివర ఒక్కొక పండు మాత్రం ఉంది. ఆ నాలుగు పళ్ళు పండగానే చెట్టెక్కి వాటిని కోసుకున్నాను. ఒక్కొక్క పండు కత్తితో కోసేసరికి అందులోంచి, ఒక్కొక్క మనిషి దూకి ఇవతల పడ్డాడు. వాళ్ళు నా చెట్టులో కాసిన పళ్ళల్లోంచి పుట్టుకొచ్చారు. కాబట్టి, వాళ్ల నలుగురు న్యాయశాస్త్రం ప్రకారం నా సొత్తు అయిపోయారు. అంటే, నాకు బానిసలై పోయారన్నమాట. అంచేత వాళ్ళచేత నా పొలంలో పని చేయించుకునేవాణ్ణి. ఇట్లా కొన్ని వారాలు గడిచిపోయాయి. ఆ నలుగురు రాను రాను పనిఎగొడుతూ, సోమరిపోతులయ్యారు. ఒకనాడు అందరూ కలిసి నాకు చెప్పకుండానే కథలు, పుక్కిటి పురాణాలు చెప్పుకుంటూ కాలం గడపవచ్చునని పారిపోయారు. ఆనాటి నుంచి, నేను వాళ్ళకోసం దేశమంతా వెదకుతూ, ఎట్లాగైనా వాళ్ళని పట్టుకోవాని విధీ విరామం లేకుండా తిరుగుతున్నాను. తీరా ఈ ఊరు వచ్చాక నా కిప్పుడెంతో సంతోషంగా ఉంది, నా బానిసలు నలుగురూ ఇక్కడే, ఈ సత్రంలోనే దొరికారు. మీరే నా బానిసలని గుర్తుపట్టాను. కాబట్టి ఇక లేవండి! నా పొలానికి తిరిగివచ్చి, ఇకనైనా బుద్ధిగా పని చేయండి, " అని ప్రయాణికుడు తనకథను పూర్తిచేశాడు.

నేను పుట్టిన ఏడాదికే బాగా ఎదిగి ముసలివాడినై పోయాను. ఒక కుందేలు ఎత్తుగా పెరిగి ఉన్న గడ్డిలోకి గబగబా పరుగెత్తటం చేశాను. నేను దాన్ని తరుముకు పోయాను, తీరా దగ్గరికి వెళ్ళి చూద్దునుగదా! నేను తరుముకు వచ్చిన జంతువు కుందేలు కాదు. భయంకరమైన పులి. నన్ను చూడగానే ఆ పులి నన్ను మింగేయాలని అమాంతం నోరు తెరిచింది.

ఈ గాథ అంతా విన్న నలుగురు యువకులు తెల్లబోయారు. వాళ్ళకి నోటమాట రావటంలేదు. కదలక, మెదలక కూర్చున్నారు, ఏమి చెప్పటానికి తోచలేదు. ప్రయాణికుడి కథ నిజమని ఒప్పుకుంటే, వాళ్ళు నలుగురు పారిపోయిన బానిసలేనని ఒప్పుకున్న వారౌతారు. అతను చెప్పిన కథంతా అబద్ధం అంటే, పోటీలో ఓడిపోయి, అలాగైనా, అతనికి బానిసలై పోతారు. ఏ విధంగా చూసినా వాళ్ళు తనకి బానిసలవాల్సి వచ్చింది. " ముందుకు పోతే నుయ్యి, వెనక్కుపోతే గొయ్యి" అన్నట్లుగా ఉంది వాళ్ళ పని.

చివరికి, ఈ పోటీకి తగ్గవరిగా నిలబడ్డ ఊరిపెద్ద వారిని ఒకటికి రెండుసార్లు, "ప్రయాణికుని కథ నమ్ముతారా?" అని అడిగాడు. యువకులు నలుగురు మాట్లాడలేదు. మళ్ళీ అడిగాడు. ఊహు! ఒక్క అక్షరమైన వాళ్ల నోటినుండి బయటకు రాలేదు. మధ్యవర్తిగా వచ్చిన పెద్దమనిషి న్యాయంగా ఆ ప్రయాణికుడే కథల పోటీలో గెలిచాడని తీర్పు చెప్పాడు.

ప్రయాణికుడు ఆ నలుగురు యువకుల్ని చూసి, " మీరు నలుగురు నాకు బానిసలయ్యారు. మీరు కట్టుకున్న బట్టలు కూడా నాకు చెందాలి గదా! ముందు మీ బట్టలన్నీ విప్పి నాకివ్వండి తరువాత మిమ్మల్ని వదలి పెడతాలెండి," అన్నాడు.

మారుమాటాడకుండా, నలుగురు యువకులు వాళ్ళు కట్టుకున్న బట్టలన్నీ విప్పి ప్రయాణికుడికి ఇచ్చారు.

అతడు వాటి నన్నింటిని చక్కగా మూట గట్టుకొని, భుజంమీద వేసుకొని, తనదారిని తాను వెళ్ళిపోయాడు. అయితే, ఈ నలుగురు తెలివిగల యువకులు సత్రంలో బిక్కముఖాలు పెట్టుకొని దిగంబరులుగా నిలబడి పోయారు.

(బర్మా కథకు అనువాదం)

■ అలనాటి రచనలు : సిహెచ్.లక్ష్మణ చక్రవర్తి

మైనాదేవి

మైనాదేవి - 1941 - చారిత్రక ఖండకావ్యం, కవి అంబటి పూడి వెంకటరత్నం, సాహితీమేఖల ప్రచురణ.

గుంటూరు నుంచి వచ్చిన వారు అంబటిపూడి వెంకటరత్నం (1908-1983) నల్లగొండ జిల్లా చండూరులో 1934లో సాహితీ మేఖల అన్న సంస్థను స్థాపించారు. మంచి పద్య కవిగా ప్రసిద్ధుడైన అంబటిపూడి వెంకటరత్నం జాతీయోద్యమ ప్రభావంతో రచించిన చారిత్రక ఖండకావ్యం మైనాదేవి. 1943 అక్టోబర్ విజయదశమి నాడు వెలుగులోకి వచ్చిన రచన ఇది. 1857 నాటి ప్రథమ భారత సంగ్రామ సారథి అయిన నానాసాహెబ్ కూతురు మైనాదేవి. ఆమె జన్మభూమి కోసం ఆత్మార్పణ చేసుకున్న చారిత్రక సన్నివేశాన్ని కావ్యంగా మలిచారు అంబటిపూడి వెంకటరత్నం.

ఆంగ్లేయులు గుర్తుపట్టకుండా సన్యాసి రూపంలో సంచరిస్తూ ఆంగ్లేయుల గుప్తచరుడైన రామపాలుడిలో మార్పు తీసుకురావాలని ప్రయత్నిస్తాడు.

'సుజాత' తెలుగు మాస పత్రిక (1927 ఫిబ్రవరి)లో జి.వెంకోబరావు రాసిన కథ 'కళంక'. దీని ప్రేరణతో ఈ కావ్య రచన చేసినట్లు కవి చెప్పుకున్నారు. 1857 నాటి టైమ్స్ పత్రిక, అప్పటి కొందరు వ్యక్తుల డైరీలు చారిత్రక ఆధారాన్ని ఈ రచనకు అందించాయి. భారత స్వాతంత్ర్య సముపార్జన కోసం ఒక మహోద్యమాన్ని నిర్మించిన నానాసాహెబ్ ఈ కావ్యానికి చారిత్రక భూమిక వంటివాడు. ఆంగ్లేయులు గుర్తుపట్టకుండా సన్యాసి రూపంలో సంచరిస్తూ ఆంగ్లేయుల గుప్తచరుడైన రామపాలుడిలో మార్పు తీసుకురావాలని ప్రయత్నిస్తాడు. హే దొరకు రామపాలుడు ఒక లేఖ తెచ్చి ఇస్తాడు. నానాను మట్టుపెట్టమని దాని సారాంశం. హేదొర కూతురు మైనా స్నేహితులు. కానీ మైనాను హే దొర కాపాడలేకపోతాడు. నానాను వెతుకుతూ వచ్చిన ఔట్రాము సైనికులు నానా సాహెబ్ భవనాన్ని కాల్చి, మైనాను వెతికి ఆమెకు చితిపేర్చి నిప్పు పెట్టి చంపుతారు. రామపాలుడి ద్వారా విషయం తెలుసుకున్న నానా అక్కడికి వచ్చి చితా భస్మాన్ని చూసి ఆమె తనకిచ్చిన స్ఫూర్తితో దేశ రక్షణ చేస్తానని ప్రతిజ్ఞ చేస్తాడు. రామ పాలుడు కూడా మాతృ భూమి కోసం పోరాటం చేయాలని నిర్ణయించుకోవడంతో కావ్యం ముగుస్తుంది.

మైనాదేవి కావ్యంలో కథా వస్తువుకు ప్రాధాన్యం లేదు. అదే విధంగా నాయకుడు ప్రతి నాయకుడు లేకపోవడం చేత నామకాశ్రితమైన రసానికి ఇక్కడ తావులేదు. 'ఒక తత్త్వానికి వ్యాఖ్యానంగా కావ్యం రాయడం ఇందులో సాధింపబడినది' అన్న వారణాసి భిక్షమయ్యశర్మ గారి మాటలు సరైనవే.

1857 స్వాతంత్ర్య సంగ్రామ నేపథ్యం నుంచి వచ్చిన సాహిత్యంలో మైనాదేవి కావ్యం ప్రత్యేకత కలది. 1943లో కావ్యాన్ని వెలుగులోకి తెచ్చిన అంబటిపూడి వెంకటరత్నం గారి పై జాతీయోద్యమ ప్రభావాన్ని అంచనా వేయవచ్చు. తెలంగాణలో జాతీయోద్యమ స్థితిని తెలుసుకునేందుకు ఈ రచన కొంత మార్గం చూపుతుంది. ఈ రచన వెలువడిన కాలం 1943 కావడం దేశభక్తి పునరుజ్జీవన ఈ కావ్య లక్ష్యమని తెలుస్తుంది. మైనాదేవి ఆత్మార్పణం, నానాసాహెబ్, రామపాలుడిలో దేశభక్తిని ప్రోదిగొల్పినట్లే భారతజాతిని మేల్కొల్పాలని కవి భావించారు. అందుకే

ఆ పసియాత్మ పైకెగసి యాకసమంతటనావరించె నే
రూపము లేకయే కనగ రోదసిలోనొక కొత్త చాయలే
వో పయికొన్న యట్టులు ప్రనబుద్ధము భారతమౌనెయన్నటుల్
ఈ పతనమ్మునిట్లె భరియింతురెలెండికనైన యన్నటుల్

అన్నారు కవి. ఈ పద్యం కంసవధను సూచించిన పరాశక్తిని స్ఫురింపజేశాడు. పసిపిల్ల రూపంలో ఉన్న ఆ శక్తి కృష్ణుడు వచ్చి చంపుతాడని చెప్పినట్లు మైనా మరణం నానాసాహెబ్ రూపంలోని కృష్ణుడిని స్ఫురింపజేస్తుంది. ఆంగ్లేయులు కంసుడిగా చిత్రించబడ్డారు.

సెల్ : 9849714261

■ **స్ఫూర్తినిచ్చిన గురువు**

నా పేరు శ్రీదేవి. నేను ఓపెన్ యూనివర్శిటీలో డిగ్రీ పూర్తి చేశాను. మా స్వగ్రామం వరంగల్ జిల్లా భూపాలపల్లె మండలంలోని గొర్లపాడు. అక్కడి హైస్కూల్లోనే పదో తరగతి చదివాను. మాకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులలో నారాయణరెడ్డి, పట్టాభి, రమేష్ మాస్టార్లు బాగా బోధించేవారు. నారాయణరెడ్డి మాస్టారు ఇంగ్లీషు సులభంగా అర్థమయ్యే రీతిలో చెప్పేవారు. గవర్నమెంటు స్కూలైనా సరే అప్పట్లో మాతో స్కూల్లో ఇంగ్లీషే మాట్లాడించేవారు. పట్టాభి మాస్టారు గణితం చెప్పేవారు. ప్రతి లెక్కను నల్లబోర్డుపై చేసి చూపించేవారు. మాదిరి లెక్కలను చేయించేవారు. ఆయన క్రమశిక్షణకు మారుపేరు.

ఆయన్ని చూస్తే విద్యార్థులందరూ క్రమశిక్షణ తప్పాలంటే భయపడేవారు. ఈ మాస్టారు నాకే కాదు మా క్లాసు మొత్తానికి నచ్చిన ఉపాధ్యాయులు. రమేష్ మాస్టారు ఆల్‌రౌండర్. అన్నీ సబ్జెక్టులు బోధించేవారు. పిల్లలందరూ ఎప్పుడూ నవ్వుతూ, ఉత్సాహంగా ఉండాలని చెప్పేవారు. చెప్పడమే కాదు, జోక్స్ వేసి నవ్వించేవారు కూడా. సాయంత్రం పూట ఉచితంగా ప్రయివేటు చెప్పేవారు. నారాయణరెడ్డి మాస్టారు ఈ మధ్యనే రిటైర్ అయ్యారని తెలిసింది. పట్టాభి సార్ వరంగల్‌లో యం.ఈ.ఒగా, రమేష్ సార్ కంఠాత్మకూర్‌లో హెచ్.ఎంగా పనిచేస్తున్నారు. వారితో మా కుటుంబం అంతా ఇప్పటికీ మాట్లాడుతుంటాం. అప్పుడప్పుడు కలుస్తుంటాం కూడా. వారు చాలా ఆప్యాయంగా మాట్లాడతారు. స్ఫూర్తినిచ్చిన గురువు శీర్షిక ద్వారా మా గురువుల గురించి నెమరు వేసుకునే అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు

- కామిడి శ్రీదేవి రెడ్డి,
పరకాల, వరంగల్ జిల్లా

■ సంగీతం

హాస్య వల్లరుల గీతమాలిక

హాస్యం లేని జీవితం నిస్సారంగా ఉంటుంది. ఆరోగ్యానికి కూడా నవ్వు ఎంతో అవసరం. నవ్వు నాలుగందాల చేటు అనేది ఒకప్పటి మాట. నవ్వు నలభై విధాల ఆరోగ్యానికి మేలు చేస్తుందనేది నేటి వైద్యుల సలహా. నవ్వుతున్నవారి ముఖం చూస్తే ఎంతటి కోపమయినా మాయమైపోతుంది. ఇంతటి మహత్యమున్న నవ్వుకి సినీ ప్రపంచంలో అగ్రస్థానం ఉంది. అందులో హాస్య నటులది ప్రత్యేక స్థానం. ప్రేక్షకులకు గిలిగింతలు పెట్టే హాస్యాన్ని పండించడంతో పాటు పాటల్లోనూ నర్తించారు వారు. హాస్య నటులపై చిత్రించిన పాటలు కూడా మంచి సాహిత్యంతో, ఏదో ఒక సందేశం అందించేవి కావడం గమనార్హం. అలాంటి పాటల్లో కొన్ని...

'వినవే బాలా.. నా ప్రేమ గోలా... గుబులు గుబులుగా, గుండెలదరగా..' అనే పాట 1951లో వచ్చిన పాట పాతాళభైరవి చిత్రంలోనిది. పింగళి నాగేంద్రరావు రాసిన ఈ పాటకు ఘంటసాల సంగీత దర్శకత్వం అందించారు.

మాయాబజార్ చిత్రంలోని 'సుందరి నీ వంటి దివ్య స్వరూపము ఎందెందు వెతికిన లేదు కదా...' ఇప్పటి తరానికీ ఎంతగానో నచ్చిన హాస్య గీతమిది. రేలంగి, సావిత్రిల మీద చిత్రించిన ఈ పాటని పింగళి నాగేంద్రరావు రాశారు. ఘంటసాల సంగీత దర్శకత్వంలో ఆయనే స్వయంగా పాడారు.

'కాశీకి పోయాను రామాహరీ, గంగ తీర్థమ్ము తెచ్చాను రామాహరీ...' 1959 వ సంవత్సరంలో విడుదలైన అప్పుచేసి పప్పుకూడు చిత్రంలోని ఈ పాటని బావా మరదళ్లైన రేలంగి, గిరిజ ఒకరి మీద ఒకరు పందెం కట్టుకున్నట్లు పాడుకుంటారు. పింగళి రాసిన ఈ పాటకు ఎస్.రాజేశ్వరరావు సంగీతం అందించారు. ఘంటసాల, స్వర్ణలత పాడారు.

కులగోత్రాలు చిత్రంలో రమణారెడ్డి పేకాటలో డబ్బులన్నీ పోగొట్టుకున్న సందర్భంలో పాడే పాట 'అయ్యోయ్యో చేతులో డబ్బులు పోయెనే... జేబులు ఖాళీ ఆయెనే...'. మాధవపెద్ది సత్యం, పిఠాపురం రాఘవులు పాడిన ఈ పాట సాహిత్యానికి రమణారెడ్డి నటన తోడై ఆబాల గోపాలాన్ని అలరించింది. కొసరాజు రాఘవయ్య చౌదరి రాసిన ఈ పాటకు ఎస్.రాజేశ్వరరావు సంగీతం సమకూర్చారు.

మాధవపెద్ది పాడిన మరో పాట 'భలే ఛాన్సులే.. భలే ఛాన్సులే ...లలల..లలల. లక్కీ ఛాన్సులే...' ఇల్లరికంలోని ఈ పాటను కొస రాజు రాఘవయ్య చౌదరి రాశారు. టి. చలపతిరావు సంగీతం అందించారు. ఇల్లరికపు అల్లుడైతే ఎన్ని లాభాలుంటాయో చెపుతూ పాడే పాట ఇది.

రేలంగి, రాజసులోచన నటించిన 'చెక్కిలి మీద చెయ్యివేసి చిన్నదాన.. నీవు చింతపోదువె ఎందుకే ఇంతలోన.... నీ చిక్కులన్నీ తీరిపోవు చిన్నదాన....' పాటలో చదువుకున్న అమ్మాయిలు మగవారి మాయమాటలను నమ్మరని, తెలివిగా ఉంటారని చెబుతుంది. మాధవపెద్ది సత్యం, జిక్కి పాడిన ఈ పాటను శ్రీశ్రీ రాశారు. మాస్టర్ వేణు సంగీతం అందించారు.

'నా షోలాపూర్ చెప్పులు పెళ్లిలో పోయాయి... అవికొత్తవి, మెత్తవి కాలికి హత్తుకు పోయేవి' అనే ఈ పాట 1981లో వచ్చిన ముద్దమందారం చిత్రంలోనిది. రమేష్‌నాయుడు సంగీతంలో వేటూరి రాసిన ఈ పాటను జిత్ మోహన్ మిత్రా పాడారు.

'సోడా సోడా... ఆంధ్రా సోడా... గోలీసోడా... ఢిల్లీ సోడా...' అంటూ లక్ష్మీ నివసంలో పద్మనాభం సోడా గురించి వివరిస్తూ... రాజకీయ నాయుకులు చెప్పే కబుర్లన్నీ ఒట్టి గ్యాసేనని పాడతాడు. ఆరుద్ర ఈ పాటకు కె.వి.మహదేవన్ సంగీతం అందించారు. పిఠాపురం నాగేశ్వరావు పాడారు.

సినిమాల్లో రమాప్రభ, రాజబాబుది హాస్య నటుల జంటగా పేరుంది. 'వినరా సూరమ్మ కూతురి మొగుడా విషయం చెబుతాను.. అసలు విషయం చెబుతాను' అంటూ 1972లో వచ్చిన ఇల్లు, ఇల్లాలు చిత్రంలో రాజబాబు, రమాప్రభ పాడే ఈ పాటలో సస్పెన్స్, థ్రిల్లర్, శృంగారాన్ని మిళితం చేసి చివర్లో హాస్యాన్ని పండించారు. అప్పలాచార్య రచించిన ఈ పాటను కె.వి.మహదేవన్ సంగీతంలో సుశీల, రాజబాబు పాడారు.



సిగరెట్టు తాగేవారికి ఎంత హాయిగా ఉంటుందో, దాని పొగ పీల్చేవారికి అంత ప్రాణ సంకటంలా ఉంటుంది. అలాంటి సిగరెట్టమీద వచ్చిన పాట 'సరదా సరదా సిగరెట్టు... ఇది దొరలు తాగు భల్ సిగరెట్టు'. 1964లో వచ్చిన రాముడు భీముడు చిత్రంలోని ఈ పాటను పాత సినిమాల్లో మరో హాస్య నటుల జంట అయిన రేలంగి, గిరిజల మీద చిత్రించారు. ఈ పాటను మాధవపెద్ది సత్యం, జమునారాణి పాడారు. కొసరాజు రాఘవయ్య చౌదరి రాసిన ఈ పాటకు పెండ్యాల నాగేశ్వరరావు సంగీతం అందించారు.

మనుషులంతా ఒక్కటే చిత్రంలో 'ముత్యాలు వస్తావా.... అడిగింది ఇస్తావా...' అంటూ రమాప్రభ, అల్లురామలింగయ్యల మీద చిత్రించిన పాట, జమున పద్మనాభం తెలివి తక్కువ తనాన్ని చెబుతూ పాడే 'ఎయ్యిర సిన్నోడెయ్యిరా... ఎయ్యిర సిన్నోడెయ్యిరా... నీ సోకుమాడ ఎయ్యిరా సిన్నోడ... దరువెయ్యిర సిన్నోడెయ్యిరా...' పాట, 1972లో వచ్చిన కలెక్టర్ జానకి చిత్రంలో 'పాట ఆగిందా... ఒక సీటు గోవిందా... సీటు గోవిందా... ఒకరి ఆట గోవిందా...' 1972లో వచ్చిన బాల మిత్రుల కథలో 'రంజుభలే రాంచిలక, రంగేళి రవ్వల మొలక... రంజుభలే రాంచిలక' పాటలు విభిన్నమైనవి.

1994లో వచ్చిన 'ష్.... గప్‌చుప్...' లో తిట్ల దండకం, 1991లో వచ్చిన సీతారామయ్యగారి మనవరాలు చిత్రంలోని 'ఓ సీతా.. మై సీతా..., 1994లో వచ్చిన మనీ చిత్రంలోని 'భద్రం బీ కేర్‌ఫుల్ బ్రదరూ భర్తగ మారకు బాచిలరూ..., వారెవా ఏమి ఫేసు.. అచ్చు హీరోలా ఉంది బాసు...' పాటలు... ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో... ఎన్నెన్నో పాటలు హాస్య నటులు, హీరోలు, హీరోయిన్ల కాంబినేషన్లో వచ్చాయి. ఇప్పుడూ వస్తున్నాయి. కాకపోతే అప్పటి కాలంలోని చిత్రాల్లోని పాటల్లో మంచి సాహిత్యంతో, కాస్తో కూస్తో సందేశం కూడుకుని ఉండేవి. ఇప్పటి చిత్రాల్లో అలాంటి సాహిత్యం కనిపించడంలేదు, వినిపించడం లేదు.

- బి.మల్లేశ్వరి

నెమలీక

అన్ని టైర్లు ఎందుకు?

లారీల వంటి భారీ వాహనాల వెనక టైర్లను మీరెప్పుడైనా చూశారా? ముందు వైపు ఒక్క టైరు ఉంటే వెనుక వైపు నాలుగు టైర్లు ఉంటాయి. చిన్న వాహనాలనైతే పెట్రోలు ఇంజనుతో నడిపిస్తారు. వీటి ఇంజన్ని ముందు టైర్ల ద్వారా వాహనాన్ని ముందుకు తీసుకెళ్తారు. అదే ఎక్కువ లోడుతో ఉన్న పెద్ద పెద్ద లారీలను డీజిల్ ఇంజనుతో నడిపిస్తారు. వాహనం పెద్దదిగా ఉండడం వల్ల వెనుక టైర్లను ముందుకు నెట్టే పద్ధతిలో ఇంజన్ ఉంటుంది. వాహనం చిన్నదైనా, పెద్దదైనా టైర్లు రోడ్డుమీద ఒత్తిడి, ఘర్షణ తీసుకురావడం వల్ల టైర్లు ముందుకు వెళ్తూ, రోడ్డును వెనక్కు నెడతాయి. రోడ్డుమీద ఎంత బలంగా ఒత్తిడి కలిగిస్తే వాహనం అంత వేగంగా ముందుకు వెళ్తుంది. పెద్ద వాహనాలకు ఎక్కువ టైర్లు ఉండడం వల్ల ఎక్కువ పట్టు వస్తుంది. ఫలితంగా ఎక్కువ వేగంగా ముందుకు వెళ్తుంటాయి.

వెతకండి

ఈ బొమ్మలో అక్కడక్కడ స్పూన్లు ఉన్నాయి. అవి ఎన్ని ఉన్నాయో, ఎక్కడున్నాయో వెతికి పట్టుకోండి.

జవాబు : 10

కనిపించాయ

ఈ అడవిలో కిందున్న వస్తువులు కొన్ని దాగున్నాయి. అవి ఎక్కడున్నాయో కనుక్కుని వాటికి సున్నా చుట్టండి.

నీడ ఏది?

ఈ ఫుట్‌బాల్ ఆటగాడిని పోలిన నీడలు ఇక్కడ ఐదు ఉన్నాయి. వాటిలో ఒక్కటే సరైనది. అది ఏదో గుర్తించండి.



జవాబు : B

చుక్కలు కలుపుదాం

నెహ్రూ జూలాజికల్ పార్క్

హైదరాబాద్‌లోని నెహ్రూ జూలాజికల్ పార్కుని 1963, అక్టోబర్ 6న ప్రారంభించారు. భారత మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పేరుమీదుగా ఈ జంతు ప్రదర్శన శాలను ఏర్పాటు చేశారు. ఈ జంతు ప్రదర్శన శాల భారతదేశంలోనే పెద్దది. దీని విస్తీర్ణం 380 ఎకరాలు. ఇందులో ఇండియన్ రైనో, ఆసియాటిక్ సింహం, బెంగాల్ టైగర్, 15 వందల జాతుల జంతువులు, పక్షులు, సరీసృపాల వంటి జీవులు ఉన్నాయి. ఇది అటవీ శాఖ వారిచే నిర్వహించబడుతుంది.

రంగులేయండి

మోసానికి ఫలితం

ఒక అడవిలో ఒక ఎలుక ఉండేది. అది ఒక రోజు తన బంధువుల ఇంటికి వెళ్లాలనుకుంది. అనుకుందే తడవు బయల్దేరింది. దారిలో దానికి ఏరు అడ్డు వచ్చింది. ఆ ఎలుకకి నీళ్లంటే చాలా భయం. అందుకే ఏటిని ఎలా దాటాలా అని ఆలోచిస్తూ ఏటి ఒడ్డునే కూర్చుంది. కొంత సేపటికి ఒక కప్ప నీటిలోంచి బయటికి వచ్చింది. ఎలుక దిగాలుగా కూర్చోడం చూసి "ఏం ఎలుకబావా! తీరిగ్గా కూర్చుని ఏమాలోచిస్తున్నావు?" అని పలకరించింది.

"ఏమీలేదు! ఈ ఏటిని దాటి మా బంధువుల ఇంటికి వెళ్లాలి. నాకేమో నీళ్లంటే చాలా భయం. ఈ ఏటిని నేను దాటలేను గదా! అందుకే ఎవరైనా సహాయం చేస్తారేమోనని ఎదురు చూస్తున్నాను" అంది.

కప్పకు ఎలుకను ఏడిపంచాలనింపించింది. "నేను నీకు సహాయం చేస్తాను. ఇదిగో ఈ తాడుని నీ నడుముకు కట్టుకో. రెండోవైపు నేను పట్టుకుంటాను, నాతోపాటు నీళ్లలో ఈదేస్తే క్షణంలో అవదలి ఒడ్డుకి చేరతావు" అంది.

కప్ప చెప్పింది నిజమేనని నమ్మింది ఎలుక. మరో ఆలోచన లేకుండా సరేనంది. కప్ప ఇచ్చిన తాడు కట్టుకుని కప్పతో పాటు నీటిలోకి దూకింది. కప్ప నీటిలోకి దిగి, కొంత దూరం వెళ్లిన తర్వాత వేగంగా ఈదడం మొదలుపెట్టింది. ఆ వేగానికి తట్టుకోలేని ఎలుక భయంతో "రక్షించండి రక్షించండి' అని కేకలు పెట్టడం ప్రారంభించింది.

"ఏరు దాటిస్తానని చెప్పానుగా. నీళ్ల ప్రవాహం చూడు వేగంగా ఉంది. తొందరగా వెళ్లకపోతే నీళ్ల ఉధృతికి మునికిపోతాం. అరవకుండా ఉండు. నిన్నేమీ చంపనులే" అని ఎలుకను తిట్టింది కప్ప. ఈ గోలంతా ఆకాశంలో వెళ్తున్న ఓ డేగ గమనించింది. అంతే! రివ్వున వచ్చి ఎలుకను పట్టి పైకి ఎగిరిపోయింది.

తీరా చూస్తే ఎలుకతో పాటు కప్ప కూడా వచ్చింది. కప్పను చూసి డేగ ఆశ్చరపోయింది.

"నువ్వెందుకు పైకి వచ్చావు' అని అడిగింది.

"నేను ఎలుకను మోసం చేయాలని తాడుకట్టి నీళ్లల్లోకి దించాను. దాన్ని చంపేలోగా నువ్వొచ్చావు" అంది కప్ప.

ఎలుకను తిందామనుకున్న డేగ కప్ప చేసిన మోసాన్ని గ్రహించింది. ఒకటి ఆహారంగా వస్తుందనుకుంటే రెండు ప్రాణులు దొరికాయని డేగకి భలే ఆనందంగా ఉంది. రెండింటిని తినేసింది డేగ.

■ కొత్త సీరియల్

ప్రేమ - విప్లవం

మూలం : మేరీ గాబ్రియేల్

స్వేచ్ఛానువాదం: **ముక్తవరం పార్థసారథి**, ఫోన్: 91776 18708

(గతవారం తరువాయి)

కోలోన్, 1842

హైన్రిష్ మరణం తర్వాత మూడేళ్లపాటు బెర్లిన్‌లోని మార్క్స్ నివాసం యంగ్ హెగెలియన్లకు కేంద్రమైంది. తను చదవాల్సిన కోర్సులన్నీ మానేసి కేవలం వీళ్లతోనే గడిపాడు కార్ల్ మార్క్స్. అయితే, ఆర్థికంగా పరిస్థితి దిగజారింది. పెరిగిన ఖర్చుల కోసం డబ్బు పంపటానికి తల్లి నిరాకరించింది. ఉన్నదంతా ఒక్కడికే పెట్టేస్తే ఎలా? మరో ఆరుగురు పిల్లలున్నారు తన మీద ఆధారపడి. జెన్నీ అన్నయ్య ఫెర్డినాండ్ (లుడ్విగ్ మొదటి భార్య కుమారుడు. వయసులో జెన్నీ కన్నా పదిహేనేళ్లు పెద్దవాడు. జెన్నీ – కార్ల్‌ల పెళ్లి ప్రతిపాదనను వ్యతిరేకించినవాడు కూడా. కార్ల్ మీద ఓ కన్నేసి వుంచాడు.) తను నిరాకరించినా, తండ్రి జెన్నీ కోరికను మన్నించటంతో, బెర్లిన్‌లోని తన పలుకుబడిని ఉపయోగించి కాబోయే బావమరిది కదలికల మీద నిఘా పెట్టాడు. నాస్తికులు, సంస్కరణవాదులు, ప్రజాస్వామ్యవాదులు, సోషలిస్టులతో చెట్టాపట్టాలేసుకొని తిరుగుతున్నాడు కార్ల్. వీళ్లందరూ అత్యంత ప్రమాదకరమైన రాడికల్స్. అతడికి ఈ కార్యకలాపాల మీద వున్న శ్రద్ధ, పెళ్లి తర్వాత భార్యా పిల్లల కోసం మంచి ఉద్యోగం సంపాదించుకోవటంలో లేదు. క్లాస్ రూంలలో కూర్చోవటానికి బదులు కేఫ్‌లలో, బీర్ బార్‌లలో గడుపుతున్నారు. ఫెర్డినాండ్ గాఢంగా విశ్వసించిన మతం (చర్చ్), రాజ్యాధికారం, కుటుంబ వ్యవస్థకు పూర్తి వ్యతిరేకం కార్ల్ మార్క్స్. కాని లుడ్విగ్ ఆశీర్వాదం వున్నంతవరకూ, కార్ల్, జెన్నీల సంబంధానికేమీ ప్రమాదం లేదు. అయినప్పటికీ, భవిష్యత్తులో ఉపయోగించవచ్చునని, కార్ల్‌కు వ్యతిరేకంగా సేకరించిన సమాచారాన్ని జాగ్రత్తగా భద్రపరిచాడు ఫెర్డినాండ్. కనీసం, తరువాతైనా తన చెల్లెలు వాస్తవాన్ని గ్రహించలేకపోతుందా!

ఈలోగా, జెన్నీ – కార్ల్‌ల మధ్య దూరం పెరిగినా, సుదీర్ఘమైన లేఖలతో ఒకర్నొకరు ఓదార్చుకున్నారు. ఎవరెన్ని సమస్యల గురించి ప్రస్తావించినా, అన్నింటా అంతర్లీనంగా ధ్వనించింది అణచుకోలేని విరహమే. ప్రతి లేఖలో విషాదాంత నాటకాలలోని నాయికా నాయకుల స్వగతాలే.

ఇక, రాజకీయపరంగా, కార్ల్ గురించి ఫెర్డినాండ్‌కు తెలిసిన విషయాలన్నీ జెన్నీకి కూడా తెలుసు. కానీ, ఆమెకు ఆ చర్యలు అంగీకారమే. తన తండ్రి, తన ప్రేమికుని వాదనలు విన్న తర్వాత ఈ లోకాన్ని మార్చి, మెరుగైన భవితకు బాటలు వేయటం సాధ్యమేనని ఆమెకు నమ్మకం కలిగింది. తనూ ఈ బృహత్ ప్రయత్నంలో భాగం పంచుకోవాలి. ఏ పనీ ఆషామాషీగా చెయ్యటం ఆమె స్వభావంలోనే లేదు. చదవటానికి కొన్ని పుస్తకాలు సూచించమని కార్ల్‌కు రాసింది. 'మంచి పుస్తకాలు, తెలుసుకోవలసిన పుస్తకాలు, కథలూ, కవిత్వం కాదు. ఇప్పుడు వాటిని చదివే ఓపిక లేదు. పుస్తకాలు కాస్త కఠినంగా వున్నా సరే కష్టపడి అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తాను'.

1840లో, తండ్రి మరణం తర్వాత, ఫ్రీడ్రిక్ విల్హెల్మ్ IV ప్రష్యా సింహాసనం అధిష్టించాడు. తండ్రి పాతకాలం వాడు. ఫ్రెంచివాళ్లతో యుద్ధాలు చేశాడు. విప్లవ భావాలకూ, నెపోలియన్‌కూ వ్యతిరేకం. కాని కొడుకుది కొత్త తరం. అభ్యుదయ భావాలు గలవాడు. నలభై అయిదేళ్లు. ఆవిర్భవిస్తున్న బూర్జువా వర్గం అతడి మీద గంపెడాశ పెట్టుకొంది. ప్రజాస్వామ్యం దిశగా సంస్కరణలు జరగాలి. పారిశ్రామిక, ఆర్థిక రంగాలలో వస్తున్న మార్పులకు అనుగుణంగా పాలసీలు వుండాలి. వాణిజ్య వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకపోతే జర్మనీ, యూరోప్ కన్నా వెనకబడిపోయే అవకాశం లేకపోలేదు. అయితే, మార్క్స్ లాంటివాళ్లకు రాజరిక వ్యవస్థంటేనే గౌరవం లేదు. ఈ కొత్త రాజు ప్రెస్సు మీదా, పబ్లిషర్ల మీదా ఆంక్షలు తొలగిస్తాడని మాత్రం ఆశలు పెట్టుకున్నారు కొందరు. కనీసం భావ ప్రకటనా స్వేచ్ఛ లభించినా చాలు.

సంస్కరణల కోసం వివిధ వర్గాల నుండి ఒత్తిడి పెరిగినా, రాజుగారు వాటిని ఖాతరు చేయలేదు. అతని ఆస్థానంలో, ఉన్నతోద్యోగాలలో వున్నవాళ్లంతా అరిస్టోక్రాట్లు, సైనికాధికారులే. అంటే, పరిపాలనా విషయంలో, తండ్రి కాలం నాటికీ, ఇప్పటికీ తేడా లేదు. ప్రాంతీయ శాసనసభలను ఏర్పాటు చేసి, తన బాధ్యత తీరిందనుకున్నాడు. అయితే, శాసనసభల్నయితే అనుమతించాడు గాని, వాటికి అధికారాలివ్వలేదు. ప్రజలలో కొందరు దైవాంశ సంభూతుడైన రాజు గారి అధికారాన్నే ప్రశ్నిస్తున్నారు గనక, వాళ్లు ఇంతకన్నా ఎక్కువ స్వేచ్ఛకు అర్హులు కారు. తను చేసిందే చట్టం. ఇంకా చట్టసభలెందుకు? నిరసనలు పెరిగితే, నిర్దాక్షిణ్యంగా అణచివేయాల్సిందే. ప్రెస్ మీదా, వాక్ స్వాతంత్ర్యం మీదా ఆంక్షలు విధిస్తాడు. ఫలితంగా, యూనివర్సిటీల నిఘా పెరిగింది. ఒక రచయిత చెప్పినట్టుగా, 'అవి సైనిక శిబిరాలను తలపించాయి', యంగ్ హెగెలియన్‌లు ప్రభుత్వం విసిరిన సవాలును స్వీకరించారు. కానీ అధికారం ముందు వాళ్లెంత!

రియాక్షనరీగా మారిన బెర్లిన్ యూనివర్సిటీ తనకిక డిగ్రీ ఇవ్వదనే భయంతో మార్క్స్ తన థీసిస్ 'Difference Between The Democritean and Ebicuxan philosophy of Nature'ను జెనా యూనివర్సిటీకి సమర్పించాడు. ఒక చిన్న జర్మన్ రాష్ట్రంలో వున్న ఈ యూనివర్సిటీ ఒక డిగ్రీ ఫ్యాక్టరీ. పోస్ట్ ద్వారా కూడా డాక్టరేట్లు ఇచ్చింది. 1841లో ఏప్రిల్ 6న తన థీసిస్ సమర్పించిన మార్క్స్, వారం రోజుల తర్వాత, అంటే ఏప్రిల్ 15నాడు 'డాక్టరేట్ ఇన్ ఫిలాసఫీ' పత్రం అందుకున్నాడు. ఈ థీసిస్‌ను లుడ్విగ్ వాన్ వెస్ట్‌ఫాలెన్‌కు అంకితమిచ్చాడు మార్క్స్ "పితృ సమానులైన మీకు ప్రేమతో... ఆదర్శవాదం కేవలం ఊహ కాదు. అదే సత్యం అనటానికి మీరే నిదర్శనం."

బెర్లిన్ యూనివర్సిటీకి తిరిగి చేరుకున్న బ్రూనో బార్ లెక్చరర్‌గా మార్క్స్‌కు ఉద్యోగం ఇప్పిస్తానన్నాడు. కానీ మతాధికారులను రాజ్య వ్యవహారాలలో వాళ్ల పాత్రను విమర్శించడం వల్ల అతని ఉద్యోగమే ప్రమాదంలో పడింది. 1841 వేసవిలో ప్రష్యన్ మినిస్టర్ ఫర్ రిలిజన్ అండ్ ఎడ్యుకేషన్ బార్‌కు వ్యతిరేకంగా అనేక ప్రకటనలు జారీ చేశాడు. అతడి అనుయాయుడిగా వున్న మార్క్స్‌మీద కూడా దీని ప్రభావం పడింది. ఫలితంగా ఇక ప్రష్యాలో ఎక్కడా ఉపాధ్యాయ వృత్తి చేపట్టటానికే అవకాశం లేకుండా పోయింది.

మార్క్స్‌కు ఇరవైమూడు. జెన్నీకి ఇరవై ఏడు. అప్పటికి ఆమె సుమారు అయిదేళ్లు అతడి కోసం నిరీక్షించింది. కానీ మార్క్స్‌కు ఉద్యోగం దొరికిందాకా వాళ్లు ఒక్కటయ్యే అవకాశం లేదు. న్యాయశాస్త్రం అభ్యసించటానికి యూనివర్సిటీలో చేరాడు మార్క్స్. కానీ వాటిమీద ఒక్కనాడూ శ్రద్ధ పెట్టలేదు. ఏది ఏమైనా ఆ రంగంలో ఇప్పటికే వందలాది మంది పోటీ పడుతున్నారు. అసలు జర్మనీలోనే నిరుద్యోగ సమస్య అధికంగా ఉంది. ఇక విద్యావంతులైన నిరుద్యోగులకు మిగిలింది చేసే అవకాశం. అది జర్నలిజంలో అన్నింటికన్నా తక్కువ వృత్తిగా పరిగణిస్తారు దాన్ని. ఒక చరిత్రకారుడు వర్ణించినట్టుగా, 'పరువు మర్యాదల్ని పట్టించుకోనివాళ్లు, నిలకడ లేనివాళ్లు, పైపై మెరుగులకు ఆశపడేవాళ్లు ఈ వృత్తిని ఎంచుకుంటారు'. ఇక జీతాలు కూడా అంతంతమాత్రమే. అదీ ఒకవేళ ఎవరైనా దయదలచి ఇస్తే! అయితే మార్క్స్ ముందర పెద్దగా ప్రత్యామ్నాయాలు లేవు.

'ప్రతిఘటనకు విద్యావంతుల ప్రథమ ఆయుధం వార్తా పత్రిక'. అప్పటికి మార్క్స్ కేవలం కొన్ని గీతాలు మాత్రమే ప్రచురించాడు. కానీ ధిక్కార స్వరం మాత్రం ఇంకా వినిపించలేదు.

1841లో రాసే అవకాశాలను వెదుక్కుంటూ ట్రీయర్, బాన్, కొలాన్ నగరాలను చుట్టి వచ్చాడు మార్క్స్. ఈ కాలంలో అతను ఎక్కువ కాలం (ఆరు వారాలు) గడిపింది ట్రీయర్‌లోనే. ఇన్నాళ్లు జెన్నీతో తన ఎంగేజ్‌మెంట్ ఒక రహస్యం. ఇప్పుడు కాబోయే దంపతులుగా చెట్టాపట్టాలేసుకొని తిరిగి అందర్నీ ఆశ్చర్యపరిచారు. కొన్ని పుకార్లు కూడా వ్యాపించకపోలేదు. యవ్వనంలో మార్క్స్ అందంగా వున్నాడని అంగీకరించిన ఏకైక వ్యక్తి జెన్నీ. మార్క్స్ జీవిత చరిత్ర రాసిన ఒక పండితుడు, ట్రీయర్‌లోని మార్క్స్ పరిచయస్తుణ్ణి ఉటంకిస్తూ 'అంతటి unattractive యువకుణ్ణి ఎవరూ చూసి ఉండరు" అన్నాడు. మనిషి బాక్సర్‌లాగ బలిష్టంగా ఉంటాడు. పెరిగిన గడ్డంతో, కాస్త అశ్రద్ధగా డ్రెస్ చేసుకుని, మొరటుగా కనిపిస్తాడు. మంచి లాంగ్ కోట్ వేసుకున్నప్పటికీ, బొత్తాములు సరిగ్గా పెట్టుకోడు. మర్యాదను అతిక్రమించి పెరిగిన నల్లటి గడ్డం, ఎప్పుడూ నోటిలో కనిపించే సిగార్ అతడికి – ఆనాటి ప్రష్యన్ పద్ధతుల ప్రకారం – ఓ తీవ్రవాదం రాడికల్‌గా గుర్తింపు తెచ్చాయి (మర్యాదస్తులు ఇళ్లలో పైపులు కాలుస్తారు). ఒక్క మాటైనా మాట్లాడకుండానే కేవలం తన వస్త్రధారణ, తన ప్రవర్తన ద్వారా సాంప్రదాయ సమాజాన్ని ధిక్కరించాడు మార్క్స్. ట్రీయర్ వీధుల్లో తను తిరుగుతున్నప్పుడు పక్కన నడుస్తుంటే జెన్నీ – సన్నగా, పొడుగ్గా, ఫురానా ఇంటి హుందాతనంతో... ఎర్రటి జుత్తు... పొడుగాటి మెడలో ఒంటిపేట ముత్యాలహారం. ఆమె ఎంతటి అందగత్తె అంటే, ఆమె ధరించిన దుస్తుల్ని కూడా ఎవరూ గమనించే వాళ్లు కారు. అయినప్పటికీ, మంచి పెంపకంలో పెరిగిన జెన్నీ, ట్రీయర్‌లో లభ్యమైన అత్యుత్తమ డ్రెస్సుల్నే ధరించేది. చూపరులకు – మక మోహిని, ఒక వెగటు పుట్టించే యువకుడు (అనుమానించదగిన వ్యక్తి కూడా) పక్కపక్కనే నడుస్తూ కనిపిస్తారు.

తమ శరీరాకృతుల గురించి ఎవరేమనుకున్నా జెన్నీ పట్టించుకోలేదు గానీ, ఇద్దరి వయసులో తేడా, ముఖ్యంగా మార్క్స్‌కు ఇంకా రికాణా లేకపోవడం ఆమెను ఆందోళనకు గురిచేశాయి. అయినా తన భయాన్నెప్పుడూ ఆమె పబ్లిగ్గా వ్యక్తం చేయలేదు. కానీ, కార్ల్ మార్క్స్‌కు ఇవేమీ పట్టవు. అవకాశాలు దొరికినా, దొరక్కపోయినా, ఆశలకూ, భవిష్యత్ ప్రణాళికలకూ కొదవలేదు. సంపన్నులైన ఉదారవాదులకూ, ప్రజాస్వామ్యవాదులకూ రాజుగారు తమను తెలిసీ తెలియని చిన్నపిల్లల్లా చూడటం విసుగు తెప్పించింది. 'అందరూ' దైవేచ్ఛ ఎలా వుంటే అలా జరుగుతుంది' అనుకోవటం పాత వ్యవస్థకు మరణ శాసనమే' అని గ్రహించాడు మార్క్స్.

రాజకీయ చర్చల మీదా, రాజకీయ పార్టీల మీదా వున్న ఆంక్షల్ని అధిగమించటాని మేధావులు తమ చర్చలకు మతపరమైన, తాత్వికమైన ముసుగులు తొడిగారు. తరచూ, 'సాహిత్య లేదా తాత్విక సంఘాలు' అనబడే బృందాల్లో సమావేశమయ్యారు. మార్క్స్, అతని అనుచరులకూ, మతాన్ని, విమర్శించటమంటే, రాజ్యాంగ వ్యవస్థలో అది పోషిస్తున్న పాత్రను విమర్శించటమే. కుళ్లిపోయిన ఈ వ్యవస్థను సమర్ధించటానికి నియంతలు, క్రీస్తు అనబడే సజ్జనుడి పేరు దుర్వినియోగం చేస్తున్నారని వాదించారు



మార్క్స్ బృందం. అందువల్ల, అది ఆలంబనగా వున్న రాజ్యంలాగా, మతం కూడా అవినీతిమయమైపోయింది. మార్క్స్, బ్రూనో, బార్ కలిసి 'నాస్తిక ఆర్కైవ్స్' అనబడే పత్రిక తేవాలనుకున్నారు. కానీ డబ్బులు కావాలిగా. ట్రీయర్‌లోని సంపన్నులందర్నీ సంప్రదించాడు మార్క్స్. అతడి ప్రయత్నాలకు జెన్నీ స్పందించింది.

'ఇక్కడి ప్రజల్ని మీరు అర్థం చేసుకోలేకపోతున్నారు. ఎవరూ మీకు ఏ ఆర్థిక సహాయమూ చెయ్యరు. నువ్వు రాజకీయాల్లో ప్రవేశించాలనుకుంటున్నావు. ఇది చాలా ప్రమాదకరమైన రంగం. డియర్ లిటిల్ కార్ల్! ఇంటి దగ్గర నీ కోసం నీ ప్రేయసి బెంగ పెట్టుకున్నది. నీతోనే తన జీవితమనుకుని క్షణమొక యుగంగా గడుపుతున్నది.

ఎప్పుడూ ప్రయాణాల్లో వుండే కార్ల్‌ను ఆమె, 'డియర్ లిటిల్ మాన్ ఆఫ్ డైల్వేస్' అనీ, 'మై డియర్ వైల్డ్ బోర్ (అడవి పంది) అనీ ముద్దుగా సంబోధించింది. అతడితో జీవితం కోసం ఆమె మానసికంగా సిద్ధపడింది. ఇక తాము భార్యాభర్తలే.

ఎంగేజ్‌మెంట్ తర్వాత, ఇన్నేళ్లు గడిచినా, ఇప్పుడామె భవిష్యత్తంతా మార్క్స్‌తో జరిగే పెళ్లిమీదే ఆధారపడి ఉంది. కానీ, ఆమె జీవితాన్ని మలుపు తిప్పే ఈ క్షణాన తండ్రి తమ బంధాన్ని ఆశీర్వదిస్తాడన్న నమ్మకం అడుగంటింది.

(సశేషం)

■ జ్ఞాపకాలు

ఉత్తరం రాసి ఎన్నాళ్లయింది!

“నా కోసం ఏమైనా ఉత్తరాలొచ్చాయా?” అని అడిగే ఉద్విగ్నపు రోజుల్లోని ఆనందమే వేరు.

చూరుకు వేలాడే కడ్డీకి చిన్నాయన రాసిన కార్డు ఉత్తరాల కట్ట... ఆ కార్డు ముక్కల్లో చిన్నచిన్న అక్షరాల్లో ఒదిగిన విషయాలెన్నో! అలాగే గుంటూరులో ఉండే మేనమామ నుంచి ఉత్తరం వస్తే అమ్మ కళ్ళల్లో సంతోషమే సంతోషం. బెజవాడ నుంచి తాను వచ్చే నెల పదో తారీఖున వస్తున్నట్టుగా అమ్మమ్మ నుంచి కార్డు వస్తే పిల్లలకు పరమానందం. ఎందుకంటే బెజవాడ నుంచి వచ్చే అమ్మమ్మ ఒక ఇంద్రజాలికురాలిలా తోచేది. ఎన్నెన్నో ఆడుకునే వస్తువులు, తినే వస్తువులు... తీసుకొచ్చేది.



సూర్యాపేటకు అరవై కిలోమీటర్ల దూరం లేని దేవులపల్లి నుంచి పెద్దనాయిన కార్డు మీదనే కాదు ఇన్‌లాండ్ కవర్‌లో ఉత్తరాలు రాసేవాడు. ఆ ఉత్తరం చూసిన నాయిన ముఖంలో మిశ్రమభావాలు... ఎందుకో తెలియదు. అనుకోకుండా వచ్చే పెద్నాయిన “ఏంరా, ఈ మధ్య ఉత్తరమే రాయడం లేదు” అని కొంచెం ఇష్టంగా విసుక్కునేవారు.

“ఏరా... వెంకన్నా ఏడో తరగతి చదువుతున్నావు... నువ్వయినా కార్డు రాయొచ్చు కదా” అని ప్రేమగా దగ్గరకు తీసుకునేవాడు. చిన్నాయనల, పెద్దనాయినల ఉత్తరాల్లో పెద్ద విశేషాలేం లేకున్నా ఆ ఉత్తరాలు చదవడం ఒక థ్రిల్లింత. కొన్ని నిష్టూరాలు, ఇంకొన్ని బాధలు, మరికొన్ని దిగమింగుకోలేని విషాదాలు ముప్పిరిగొనేవి.

బాల్యం నుంచి కౌమారంలోకి రాగానే ఉత్తరాల పరంపర మొదలయింది. ఒకే ఊళ్ళో వుండి కూడా ఉత్తరాలు రాసుకోవచ్చని, నేను ఇంట్లో లేనప్పుడు నయీం చిన్న చీటీకి బదులుగా ఒక పేజీ అంత ఉత్తరం రాసి ఇచ్చి వెళ్ళినప్పుడే తెలిసింది. తానే పోస్టు చేయని ప్రేమలేఖలు చూపిస్తే మరింత ఆశ్చర్యమేసింది. ఇంటర్‌లో జ్యోతికి రాసిన ప్రేమలేఖలు పోస్టు చేయక దాచుకునేవాడు. పోస్టు చేయొచ్చు కదా అంటే, అలా చేస్తే ఏమైనా ఉందా... గొడవయిపోదూ! అనేవాడు. తెలిసిన మనుషులకు, తెలియని పెద్ద మనుషులకు సైతం ఉత్తరాలు రాసేవాడు. అలాగే నవీన్ ‘అంపశయ్య’ని చదివి పెద్ద ఉత్తరమే రాశాడు. పోస్టు చేయలేదు. అడ్రసు లేదు. అడ్రసు తెలుసుకునే మార్గమూ లేదు. ఆ ఉత్తరాన్ని చదివి వినిపిస్తే మరింత విస్మయానికి లోనయ్యా. ‘అంపశయ్య’ కావాలన్నా, తెచ్చిచ్చాడు. ఆ తర్వాత నవీన్ ‘లైఫ్ ఇన్ ఏ కాలేజీ’ పుస్తకంలో అడ్రసు కనిపిస్తే ఉత్తరం రాశాడు.

అప్పట్లోనే స్టార్‌బుక్‌హౌస్‌లో కవిత్వమూ, కథలూ, నవలలూ చదువుతూ, వారపత్రికల్లో ‘కలం స్నేహం’ ప్రకటనలు చూసి, బయటివాళ్ళకు ఉత్తరాలు రాయడం మొదలెట్టింది. ‘కలం స్నేహం’ శీర్షికలో హాబీల కింద పుస్తకాలు చదవడం, చిన్నచిన్న కథలు, కవితలు రాయడం అని వుంటే చాలు... వెంటనే వాళ్ళకు ఉత్తరాలు రాసేవాళ్ళం. ఆవిధంగానే పరేష్ ఎన్.దోషి (విజయవాడ), ఎన్.కె.నాగేశ్వరరావు (పెనుగొండ), విజేందర్ (ఆదోని) వంటి రచయితలు... మరెందరో బాల సాహిత్య రచయితలతో ఉత్తరాలు రాసిన రోజులు జ్ఞాపకాల హరివిల్లులు.

తర్వాతి కాలాన చిన్న చిన్నకథలు, కవితలతో మొదలెట్టి రచయితలకు నేరుగా ఉత్తరాలు రాసే తొలియవ్వనప్రాయపు రోజులు మరల రమ్మన్నా రావు. ఒకటికి నాలుగుసార్లు రాయాల్సిన అవసరాన్ని సుదీర్ఘమైన ఉత్తరాల్లో వివరించిన కృష్ణాబాయి, కొత్తపల్లి రవిబాబు వంటి లేఖల్లోని అక్షరాలు మరచిపోలేని స్మృతులు. ఉత్తరం అందిన వెంటనే జవాబుఇచ్చే కె.వి.రమణారెడ్డి రాసిన ప్రత్యుత్తరాలు ఎంత విలువైనవో ఆనాడు తెలియదు. కానీ కావలి నుంచి రమణారెడ్డి గారు ఉత్తరం రాశారంటే భలే వుండేది. ఉత్తరమే కాదు ‘చైతన్యవాణి’ అనే లిఖితపత్రికకు మూడు నెలలపాటు ప్రశ్నల–జవాబుల శీర్షిక కింద జవాబులు అందించిన వారి ఓపిక, సౌజన్యం సదా స్మరణీయం.

ఇంటర్ నుంచి డిగ్రీ, డిగ్రీ నుంచి పిజి... ఉస్మానియా క్యాంపస్‌కు వచ్చాక ఉత్తరాల సంరంభం అంతులేనిదిగా కొనసాగిన కాలం ఒక అద్భుత ఘట్టం. ఆ తరంలో కాస్త చదవనూ, రాయనూ వచ్చిన వారంతా, సాహిత్యపరిమళం అబ్బినవారంతా ఉత్తరాల్లో మునిగితేలిన వారే. ఎవరోచెబితే వచ్చింది కాదు, అదొక జీవన వ్యాపకం. జీవితంలో విలువైన అంతర్భాగం. నాడు చలం ఉత్తరాలు, ఇందిరకు నెహ్రూ రాసిన ఉత్తరాలు, సంజీవ్‌దేవ్ లేఖలు, గోపీచంద్ పోస్టు చేయని ఉత్తరాలు, మహానాయకుల ఉత్తరాలు ఎన్నో చదివిన తన్మయత్వంతో కాలం గుబాళించేది. రంగనాయకమ్మ రాసిన ఉత్తరాలు మార్క్సిజానికి సంబంధించిన పాఠాలు నేర్పాయి.

ఉత్తరం కోసం ఎదురుచూడటం, ఉత్తరం రాయటం, అది కూడా చదివిన పుస్తకాలు, చూసిన సంఘటనలు, చేసిన బాసలు, చెప్పుకున్న మాటలు ఎన్నో నిక్షిప్తం చేసి ఓపికగా పెన్నుతో కాగితాల మీద కాగితాలు రాసి పోస్టు చేయడం... ఊహకు అందని అబ్బురం.

మిత్రులకయితే ఎంత పెద్ద ఉత్తరం రాస్తే అంత గొప్ప. చూసిన సినిమా గురించి చెప్పాల్సిందే. జరిగిన మీటింగ్ గురించి వివరించాల్సిందే. లెక్చరర్ల రసహీన లెక్చర్ల గురించి ప్రస్తావించాల్సిందే. చదివిన పుస్తకాలు, అందులోని పాత్రలు... ఆ పాత్రల సంభాషణలు... రాయాల్సిందే. కార్డు ఎంతమాత్రం ఇష్టం ఉండేది కాదు. మనం రాసింది, మొదట మరెవడో చదువుతాడని చిరాకు. ఇన్‌లాండ్ కవర్ సరిపోతుందా... పార్ట్ 1, 2, 3 అంటూ రాయాల్సి వచ్చేది. అందుకే ఏకంగా నోటుబుక్స్‌లోని కాగితాల మీద పేజీల కొద్ది రాయడం...

అటు వైపు నుంచి నయీం, రామదాస్, చిమ్మని మనోహర్, రవీందర్, సైదాచారి, రఫీ... త్రిపుర రమణమూర్తి అంతే సీరియస్‌గా ఉత్తరాలు రాసేవాళ్ళు. ఉత్తరాల్లో సాహిత్యచర్చలకు కొదవలేదు. సాహిత్యమే ప్రపంచంగా, ఉద్యమాలే లోకంగా బతికిన రోజులు ఉత్తరాల్లో అక్షరాలుగా భాసిల్లేవి.

రావాల్సిన సమయానికి ఉత్తరం రాకపోతే కలిసినప్పుడు తిట్లు... ఉత్తరం రాయలేనంత బిజీ ఏమిటిరా బాబు... అంటూ

కోపాలు... అలకలు... ఇంటినుంచి హైదరాబాద్‌కు వచ్చే ప్రతిసారి 'వెళ్ళగానే ఉత్తరం రాయి' అనే అమ్మ మాటలు... ఇప్పుడంతా ఒక జ్ఞాపకాల చమ్కీదండ.

కొన్ని ఉత్తరాలు చూడగానే మనసు పరవశించేది. ఇష్టంగా, ప్రేమగా, ఏకాంతంగా మరల మరల చదువుకోవల్సిన, చదివి దాచుకోవల్సిన ఉత్తరాల గురించి ప్రత్యేకించి చెప్పక్కర్లేదు.

ఆ అనుభూతుల పరంపర అంతా జెట్ స్పీడ్ వేగాన్ని మించిన నేటి గిగాబైట్ సమాచార యుగంలో ఒక వింత! మనసులోని మాటని మరుక్షణమే చెప్పే సౌలభ్యం వచ్చాక ఉత్తరం ఇచ్చే అనుభూతి మసకబారింది. ఉత్తరం అందుకోవాల్సిన వారి చిరునామా కోల్పోయింది. ఉత్తరాలు రాద్దామన్నా ఎవరికి రాయాలన్న ప్రశ్న మిగిలింది. రాయదగ్గ మనుషులే కరువయ్యారు. క్రమంగా రాయడమే తగ్గింది. అసలు చేత్తో రాయడమే పోయింది. వందలాది ఉత్తరాలు రాసిన చేతులు కీబోర్డుకు అలవాటుపడి రాతనే మరిచాయి. అందుకే 'వరల్డ్ పోస్టల్ డే' ఈ నెల తొమ్మిదో తేదీన అన్న మాట చూడగానే ఉత్తరం రాసి ఎన్నాళ్లయిందనిపించింది!

- జీవి

స్ఫూర్తినిచ్చిన గురువు ఎవరు?

బడికి వెళ్ళినప్పట్నించి కాలేజీ దశ వరకు ఎందరో ఉపాధ్యాయులు మనకు పాఠాలు బోధిస్తారు. వారిలో కొంతమంది గుర్తుండిపోతారు. కొందరు గొప్ప స్ఫూర్తిని ఇస్తారు. వారు చెప్పిన పాఠాలుగానీ, కొన్నిమంచి మాటలు గానీ మనసులో ముద్రించుకుపోతాయి. ఆవిధంగా మిమ్మల్ని ప్రభావితం చేసిన ఉపాధ్యాయుల గురించి ఈ శీర్షికకి రాయండి. మీకు స్ఫూర్తినీ, ఉత్తేజాన్నీ ఇచ్చి ప్రోత్సహించిన ఉపాధ్యాయుల్ని ఈ శీర్షిక ద్వారా గుర్తు చేసుకోండి.

మీ రచనతో పాటు ఫోటో కూడా పంపండి. 'సోపతి'లో ప్రచురిస్తాం.

చిరునామా: సోపతి, ప్రజాశక్తి ఆదివారం సంచిక, ప్రజాశక్తి తెలుగు డైలీ, 21/1, ఎమ్.హెచ్.భవన్, అజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగలింగంపల్లి, హైదరాబాద్-20

రచయితలకు సూచనలు

✎ 'సోపతి' కోసం వ్యాసాలు, కథలు, కవితలు పంపించండి.

✎ కథకు పేజీల పరిమితి లేదు. కథ అయి వుండాలి, అంతే! చదివించే గుణమే ప్రధానం.

✎ అనువాద కథ, కవితలు కూడా పంపించవచ్చు. మూల రచయిత అనుమతి పత్రం తప్పనిసరి.

✎ యాత్రా కథనాలకు ప్రత్యేక ప్రాధాన్యం. మీరు చూసి వచ్చిన ప్రదేశాల గురించి, మీ అనుభవ నేపథ్యంలో రాసి, తగిన ఫోటోలతో పంపించండి.

✎ రచనల్ని తిప్పి పంపాలనుకునేవారు తగిన స్టాంపులున్న కవర్‌ని జత చేయాలి.

✎ రచనతో పాటు రచయిత అడ్రసు ఉండాలి.పిన్‌కోడ్ నెంబరు తప్పనిసరి అవసరం. మీ ఫోను నెంబర్, వీలయితే ఈమెయిల్ కూడా ఇవ్వడం మంచిది.

✎ రచనల ప్రచురణకు సంబంధించి ఫోన్లలో ఎలాంటి సంప్రదింపులకు తావు లేదు.

✎ ఆరోగ్యకరమైన హాస్య, వ్యంగ్య రచనలకు ప్రాధాన్యం వుంటుంది.

✎ సమీక్షకోసం పుస్తకాలు పంపేవారు రెండు ప్రతులు పంపించాలి.

చిరునామా: సోపతి, ప్రజాశక్తి ఆదివారం సంచిక, ప్రజాశక్తి తెలుగు డైలీ, 21/1, ఎమ్.హెచ్.భవన్, అజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగలింగంపల్లి, హైదరాబాద్-20

■స్మరణ

నటనకు జీవం పోసిన కన్నాంబ

ఆమెది చక్కని రూపం, మధురమైన గొంతు, స్పష్టమైన ఉచ్చారణ. రాగానికి భావాన్ని, భావానికి భావప్రకటనని జోడించి కరుణ రసాన్ని, రౌద్ర రసాన్ని ప్రదర్శించి సినీ ప్రేక్షకులను మంత్ర ముగ్ధుల్ని చేసిన అలనాటి నటి 'కన్నాంబ'. రాగయుక్తంగా పద్యం చదివే వాళ్లందరూ నటులనిపించుకున్న రోజుల్లో నటిగా రంగస్థలం మీదకి అడుగు పెట్టారు. నాటక రంగం నుంచి సినిమాల్లోకి ప్రవేశించి తెలుగుతోపాటు తమిళ, హిందీ చిత్రాల్లో నటించి మూడు తరాల ప్రేక్షకులను అలరించిన అలనాటి నటి **కన్నాంబ జయంతి ఈ రోజు.** ఆమె తెలుగు పరిశ్రమ అభివృద్ధికి ఎంతగానో పాటుపడ్డారు. అయితే ఇప్పుడు ఏ కొంత మంది తప్ప తెలుగు సి నిమా ఇండస్ట్రీ ఆమెను దాదాపుగా మరచిపోయిందంటే అతిశయోక్తి కాదు.

నాటకాల్లో వెలిగారు.. : కన్నాంబ పూర్తి పేరు 'పసుపులేటి కన్నాంబ'. ఆమె కడప జిల్లాలోని లోకాంబ, వెంకట్రామయ్య గార్లకు ఏకైక సంతానం. అయితే కన్నాంబ ఎక్కువగా ఏలూరులో పెరిగారు. కన్నాంబ తన 16వ ఏట అంటే 1927లో, ఏలూరులోని నరాల నాటక సమాజం వారి హరిశ్చంద్ర నాటకం చూసింది. ఆ నాటకంలో చంద్రమతి పాత్ర ధరించిన నటి పెద్దగా ఏడ్వడంతో ప్రేక్షకులు నవ్వసాగారు. ప్రేక్షకుల మధ్య నున్న కన్నాంబ లేచి తాను ఆ పాత్రను ఆమె కంటే బాగా నటిస్తానని ప్రకటించారు. చంద్రమతి పాత్రధారిణి వెంటనే నటన అంటే ఆషామాషి వ్యవహారం కాదని, స్టేజీపైకి వచ్చి నటించమని సవాలు విసిరారు. కన్నాంబ ఆ పాత్రను ఆమె కంటే బాగా నటించి ప్రేక్షకుల్లో కన్నీరును తెప్పించారు. మరుసటి రోజు నుంచే ఆమె ఏలూరు నాటక సమాజంలో సభ్యురాలై, హరిశ్చంద్ర, అనసూయ, సావిత్రి, యశోద, ప్రహ్లాద, కృష్ణాలీలల వంటి నాటకాల్లో నటించి ప్రేక్షకుల ప్రశంసలందుకున్నారు. కన్నాంబ రాజరాజేశ్వరిదేవి భక్తురాలు. దీంతో ఆ పేరుతోనే నాట్య మండలిని నెలకొల్పి రాష్ట్రంలోని అన్ని ముఖ్య పట్టణాల్లో ఎన్నో ప్రదర్శనలిచ్చారు. ఆ సమయంలోనే ఆ సంస్థ యాజమాన్యం బాధ్యతలు చేపట్టి, ఆమె కళాజీవితానికి మెరుగులు దిద్దిన కడారు నాగభూషణం తదనంతర కాలంలో ఆమెను పెళ్లి చేసుకున్నారు.

సినీ జీవితం... : తన అభిమాన పాత్రను తెరపై కూడా ప్రదర్శించే అవకాశం కన్నాంబకు 1935లో లభించింది. స్టార్ కంబైన్స్ సంస్థ నిర్మించిన 'హరిశ్చంద్ర' చిత్రానికి టి.ఎ.రామన్ దర్శకుడు. దీనిలో చంద్రమతి పాత్రలో కన్నాంబ నటించారు. తర్వాత 'ద్రౌపది వస్త్రాపహరణం' అనే సినిమాలో ద్రౌపదిగా నటించి కరుణ రసాత్మక పాత్రధారిణిగా త్వరలోనే గొప్పపేరు సంపాదించారు. ఆ తర్వాత ఎస్.ఎం. రెడ్డి, బి ఎన్ రెడ్డి సంస్థలో భాగస్వామిగా 1938లో 'గృహలక్ష్మీ' చిత్రంలో అద్భుతంగా నటించారు. జయ ఫిల్మ్స్‌వారి 'కాళిదాసు' చిత్రంలోనూ నటించారు. ఇక ఆ తర్వాత సరస్వతి స్టూడియో భాగస్వామిగా 'చండిక' చిత్రంలో కథానాయికగా నవరసాలను అద్భుతంగా నటించి ప్రేక్షకుల మన్ననలందుకొన్నారు. అయితే ఈ చిత్రంలో ఆమె పాడిన 'నేనే రాణినైతే.. యేలనే ఈ ధర ఏకధాటిగా..' అంటూ కన్నాంబ పాడితే. ఆమె వీర రసాభినయానికి ప్రేక్షకులు ఆవేశపూరితులయ్యారు. ఈ పాట కోసమే ఆ రోజుల్లో ఆ సినిమాని మళ్లీ మళ్లీ చూసేవారట ప్రేక్షకులు. అలా జగదేకవీరుడి కథ, లవకుశ, ఆప్తమిత్రులు, రామదాసు, ఆత్మబలం వంటి సూపర్ హిట్ చిత్రాల్లో నటించారు.

తమిళ ఎంట్రీ... : జెమిని స్టూడియో డైరెక్టర్ రఘుపతి ప్రకాశ్, తమ తమిళ చిత్రంలో నటించే అవకాశం వచ్చింది. అయితే భాష సమస్యగా మారడంతో వదులుకున్నారు. కానీ ఎం.కె.త్యాగరాజు భాగవతార్ నటించిన 'అశోక్ కుమార్' చిత్రంలో అంగీకరించారు. 1941లో 'కన్నగి' అనే చిత్రంతో తమిళంలోకి ప్రవేశించారు. ఇచ్చారు. దీంతో తమిళంలో నటించిన తొలి తెలుగు నటిగా ఆమె పేరుగాంచారు. దాదాపు పాతికేళ్లపాటు పి.యు. చిన్నప్ప, ఎంకె రాధ, నాగయ్య, ఎంజిఆర్, శివాజీ గణేషన్, ఎస్ఎస్ రాజేంద్రన్ వంటి అగ్ర హీరోలతో తమిళంలో సినిమాలు చేశారు. తెలుగు, తమిళ భాషల్లో కలిసి కన్నాంబ సుమారు 150సినిమాలకు పైగానే నటించారు. ఇందులో పౌరాణికాలు, జానపద, సాంఘికాలు ఉన్నాయి. భక్తిరస ప్రధానమైన పాత్రలను ఆమె ఎంత

ఆమె పాడిన 'నేనే రాణినైతే.. యేలనే ఈ ధర ఏకధాటిగా..' అంటూ కన్నాంబ పాడితే. ఆమె వీర రసాభినయానికి ప్రేక్షకులు ఆవేశపూరితులయ్యారు. ఈ పాట కోసమే ఆ రోజుల్లో ఆ సినిమాని మళ్లీ మళ్లీ చూసేవారట ప్రేక్షకులు

హుందాగా, ఉన్నతంగా పోషించారో, అంతే సామర్థ్యంతో రౌద్ర, కరుణరస పాత్రలలో నటించారు.

సొంత నిర్మాణ సంస్థ... : కన్నాంబ నటిగా స్థిరపడిన తర్వాత సొంతంగా చిత్ర నిర్మాణ సంస్థను నెలకొల్పారు. శ్రీరాజరాజేశ్వరి ఫిలిం కంపెనీ పతాకంపై నిర్మించిన తొలి చిత్రం 'తల్లి ప్రేమ', రెండో చిత్రం 'సుమతి'. ఇలా సుమారు 25 సినిమాలను తన బ్యానర్‌లో నిర్మించారు. ఈ సినిమాలతో దర్శకత్వం బాధ్యతలు చేపట్టారు.

కన్నాంబ దైవభక్తురాలు. సంతానం లేదు. దీంతో ఓ కూతురు, కొడుకుని దత్తత తీసుకున్నారు. కూతురు రాజరాజేశ్వరి. ఆమె సినీ దర్శకుడు సి.పుల్లయ్య కుమారుడు సిఎస్ రావుని పెళ్లాడింది.

కన్నాంబ నటనను కొనియాడుతూ 'కన్నాంబ యువ నటీనటులకు నటనలో కిటుకులను తెలియజేసేవారన్నారు ప్రముఖ నటి అంజలీదేవి. 'ఆమె మాకు డైలాగ్ డెలివరీలో శిక్షణనివ్వడమే కాక పెద్దలను ఏ రీతిగా గౌరవించాలో కూడా నేర్పించారు. తెలుగు నటీనటులు తమిళ చిత్రాలలో నటించే తీరును కన్నాంబ, భానుమతి మాకు నేర్పారు' అని అంజలీదేవి పేర్కొన్నారు.

కన్నాంబ నటించిన చిత్రాలన్నీ విజయభేరి మ్రోగించాయి. భక్తిరస ప్రధానమైన పాత్రలనెంత గొప్పగా నిర్వహించారో అంతే సామర్థ్యంతో రౌద్ర, కరుణ రసాలు చిందించే పాత్రలు పోషించారు. 51ఏళ్ల అత్యంత గౌరవ ప్రదంగా జీవించిన కన్నాంబ 1964 మే 7న కన్నుమూశారు. కన్నాంబ అద్భుతమైన నటిగా తరతరాలు గుర్తుండిపోతారు.

– ఎ.రాజు

■ ఎరుక : మునిమడుగుల రాజారావు

ధ్యానమంటే! నదిలోకి దూకడమే...

ఆశ్రమంలోకి పరుగులాంటి నడకతో ప్రవేశించిన ఒక నూనూగు మీసాల యువకుడు, సరాసరి ఆ ఆశ్రమం పెద్ద అయినటువంటి స్వామిని సమీపించి ఎదురుగా నిలబడ్డాడు ఒక్క క్షణం కూడా వృధా చేయకుండా స్వామిని యువకుడు అడిగాడు. "స్వామీ! నాకు సత్యమంటే ఏమిటో తెలుసుకోవాలనుంది. అందుకు మీ సహాయం కావాలి", అని.

ఆ యువకున్ని తేరిపార చూసిన స్వామి ఇలా అన్నాడు. "ఎవరికైనా సరే సత్యమంటే ఏమిటో తెలుసుకోవాలనే కోరిక జనించటం ఎంతో మంచిది. చాలా సంతోషం. అయితే సత్యాన్ని తెలుసుకునే ముందు నువ్వొక పని చేయాలి. అదేమంటే! ముందుగా నువ్వు ఇక్కడి నుంచి బయలుదేరి సముద్రాన్ని చూసి రావడం..." మరుక్షణమే ఆ యువకుడు సముద్రాన్ని చూసి రావడానికి బయలు దేరాడు. పల్లెల్ని దాటేసి, గ్రామాల్ని దాటేసి, పట్టణాల్ని దాటేసి సముద్రాన్ని చేరుకోవడానికి పయనమై వెళ్లుచున్నాడు. రోజులు గడుస్తున్నాయి, నెలలు గడుస్తున్నాయి. సముద్రాన్ని తొందరగా చేరుకోవాలి. అనే కోరిక మరింత ఎక్కువవుతోంది. ఇంతలోనే దారిలో ఎదురుపడ్డ మరొక స్వామికి విషయమంతా చెప్పి సముద్రాన్ని తొందరగా చేరటానికి ఉపాయమేదైనా ఉంటే చెప్పమన్నాడు. అందుకు బదులుగా స్వామి "నువ్వు ఏదైనా ఒక నదిని పట్టుకో... ఎందుకంటే! నదికే బాగా తెలుసు, సముద్రం ఎక్కడుంటుంది అనే సంగతి...దాని పయనం కూడా సముద్రాన్ని చేరడం కోసమే" అని అన్నాడు.

ఆ తరువాత యువకుడు ఒక నదిని చేరుకుని దానితోపాటుగా నడవటం మొదలు పెట్టడు. నది ఎటువైపు వెళితే అతను అటువైపే వెళ్ళుతున్నాడు. అతడికిప్పుడు అతని ప్రయాణం పట్ల ఎలాంటి అనుమానం లేదు. ఖచ్చితంగా ఏదో ఒక రోజు సముద్రాన్ని చేరుతాను అన్న నమ్మకం అతనిలో మరింత బలోపేతమైంది. కాల ప్రవాహంతో వర్షాకాలం వచ్చేసింది. అప్పటి వరకూ నిదానంగా, నెమ్మదిగా వెళ్తోన్న నది వర్షాకాలం ప్రభావానికి పరుగులు తీయడం ప్రారంభించింది. దానికి అనుగుణంగానే ఆ యువకుడూ పరుగెత్తడం ప్రారంభించాడు. పరుగులు తీయడం వలన అతడు అలసిపోతున్నాడు. అందుకనీ అక్కడక్కడా ఆగి పోతున్నాడు. కొద్దిగా కుదురుకున్నాక మళ్లీ ప్రయాణం మొదలు పెడుతున్నాడు కష్టమవుతుంది. ప్రయాణం భారంగా సాగుతోంది. ఇంతలో మరొక స్వామి నది ఒడ్డున కనపడ్డాడు. యువకుడు ఆ స్వామికి విషయమంతా చెప్పి, ఏలాంటి కష్టం లేకుండా సముద్రాన్ని తొందరగా చేరే ఉపాయం ఏమైనా ఉంటే చెప్పమన్నాడు. అందుకా స్వామి యువకుడిని "ఆ నదిలో దూకెయ్య"మన్నాడు. స్వామి మాటలు విన్న యువకుడు కంగారు పడిపోతూ "నదిలోకి దూకడమా! నదిలోకి దూకితే నీటిలో మునిగిపోయి చనిపోనా?" అన్నాడు అమాయకంగా...యువకుడి మాటలకు పగలబడి నవ్వుతూ స్వామి అన్నాడు " అటు చూడు! ఆ నదిపైన ఎంతో పెద్ద పెద్ద జంతు కళేబరాలు, పెద్ద పెద్ద చెట్లు ఎంత అవలీలగా ఆ నది మీంచి కొట్టుకు పోతున్నాయి. అవన్నీ నీకన్నా ఎంతో పెద్దవి, నీకన్నా ఎంతో బరువైనవి, మరి అవి నీటిలో (నదిలో) మునిగి పోతున్నాయా?.

"అవి ప్రాణాలతో లేవు కాబట్టే నదిపై తేలుతూ కొట్టుకు పోతున్నాయి" యువకుడు జవాబిచ్చాడు ఎంతో తెలివైన వాడిలా సంబరపడిపోతూ...

"అవి ప్రాణాలతో లేనందులకు కాదు. నదిలో మునిగిపోనిది. అసలు కారణం ఏమిటంటే! అవి ఆలోచనలు అనే అగుపడని బరువుల్ని మోయడం లేదు కాబట్టి, భవిష్యత్తులో ఏమి జరగబోతుందో అనే అనవసరమైన అవాస్తవమైన భయాల్ని అవి మోస్తలేవు కాబట్టి, నదిచేసే సహజాత ప్రాకృతిక చర్యకు అవి వ్యతిరేక దిశలో ఎలాంటి యుద్ధం చేయడం లేదు కాబట్టి, అదీ గాక నీటి అణువుల మధ్యనున్న ఆకాశంకంటే ఎక్కువ ఆకాశాన్ని కలిగి ఉన్నవాటిని నది ముంచలేదు. సరే! ఈ కథంతా ఎందుకు గానీ, నువ్వు నదిలో దూకెయ్! ఆ తరువాత ఏం జరుగుతుందో నీకు నువ్వే చూద్దువుగానీ" అని చెప్పి ఆ స్వామి తన దారిన తాను వెళ్లిపోయాడు.

యువకుడికి ఈత కూడా రాదు. కానీ గమ్యాన్ని చేరాలి. లక్ష్యాన్ని నెరవేర్చుకోవాలి. స్వామి చెప్పిన మాటల్ని మననం చేసుకున్నాడు. నదిలో దూకేసాడు. నదిలోకి దూకాక మునిగిపోతోన్నట్టు అనిపించింది. కానీ తన కాళ్లు చేతులూ తనకి తెలియకుండానే కదలాడడం ఆరంభించాయి. ప్రతి జీవి చాలా తెలివి కల్లది. అది ప్రమాదం ముంచుకొచ్చినపుడే తన తెలివిని ప్రదర్శిస్తుంది. అతడికి ఈత వచ్చేసింది. (వాస్తవానికి అతడికి ఈత వచ్చేసింది, అని అనడం సరియైన మాట కాదు. అతడికి ఈత గుర్తుచేయబడింది అని అనడమే సరియైన మాట). అతడిప్పుడు నదిలో మునిగిపోవడం లేదు. ఇంతలో నది మీంచి ఒక వెడల్పాటి కర్రబల్ల తనకి సమీపంగా కొట్టుకు రావాడం అగుపించింది. అంతే ఇక! దానిపైన ఎక్కి కూర్చున్నాడు. నది ప్రవాహంతో పాటుగా అతడిప్పుడు ప్రయాణం చేస్తున్నాడు. అతడికి ఎంతో హాయిగా ఉంది. నదిపైన అలా చాలా దూరం వెళ్లాడు. నదిపై కొట్టుకుపోతోన్న కర్ర బల్ల అతడికి ఊయల అయింది. అతడు కూర్చునే ఉన్నాడు. అలసిపోయిన అతడి శరీరానికి నిద్ర పట్టింది. నదిపైన ప్రయాణపు చిన్న చిన్న కుదుపులు అతడి స్పృహలోకి వస్తూనే ఉన్నాయి. ప్రయాణం ఇంకా సాగుతూనే ఉందనే విషయం అతడు కళ్లు తెరవక పోయినా అతడికి తెలుస్తూనే ఉంది. ఎన్నో రోజులు గడిచిపోయాయి.

ఒక రోజు అసంకల్పితంగానే అతడి కళ్లు తెరుచుకున్నాయి. దాదాపుగా అతడు నడి సంద్రంలో ఉన్నాడు. ఇప్పుడక్కడా ఏ నదీ లేదు. నది ప్రవాహమూ లేదు. నది ప్రవాహపు గల గలల చప్పుళ్లూ లేవు. ఎటు చూసినా సముద్రమే. ఎంతో ప్రశాంతంగా ఉంది. ఎంతో ఆనందంగా ఉంది. ఎందుకంటే! ఆకాశంలోని చుక్కలన్ని సముద్రం అలలపై ఆడుకుంటున్నాయి. సముద్రమంతటా పరచుకున్న చల్లని తెల్లని వెన్నెల. ఆకాశాన్ని సముద్రాన్ని వేరు వేరుగా గుర్తు పట్టరాకుండా ఉంది. ఒక్కసారిగా అతడికి భయం కూడా వేసింది. హఠాత్తుగా! అవధులే లేని ఒక అద్భుత సౌందర్యాన్ని చూడాల్సి వచ్చినపుడు మనసు భయానికి గురవుతుంది. అప్పటి వరకు పరిచయమే లేనటువంటిది హఠాత్తుగా పరిచయమైనపుడు మనసు భయపడుతుంది.

మరి కొన్ని రోజుల తరువాత ఆశ్రమంలోకి మళ్లీ అడుగుపెట్టిన యువకుడు స్వామి ఎదుట నిలబడి "స్వామి! నేను సముద్రాన్ని చూసి వచ్చాను. ఇప్పుడైనా చెప్పండి! సత్యమంటే ఏమిటో" అని అడిగాడు. యువకుడి మాటలకు బదులిస్తూ స్వామి అన్నాడు" తప్పకుండా చెబుతాను. అయితే నువ్వు మరొక పని చేయాల్సి ఉంది. ఆదేమంటే నువ్వు నీకిష్టమైన రీతిలో సుఖాసనంలో కూర్చుని ధ్యాన ప్రక్రియని మొదలు పెట్టడం. నువ్వు సముద్రాన్ని చేరటానికి చేసిన ప్రయాణంలో నదిలోకి దూకడం అనేది అత్యున్నతమైనది. అదే పనిని నువ్వు ధ్యానంలో కూడా చూయాల్సి వస్తుంది. అలా నదిలోకి దూకడమే సరియైనది. ధ్యానంలో నిన్ను ఎంతో ఇబ్బంది పెట్టేది మనసు ఒక్కటే. సత్యమనే "నిన్ను" నీవు తెలుసుకునేందుకు అది ఎన్నెన్నో ఆటంకాల్ని కలిగిస్తూ ఉంటుంది. అందుచేత దాని బారినుండి తప్పించుకోవడానికి నువ్వు ఉనికి అనబడే నదిలోకి దూకేయడమే మంచిది. (వాస్తవానికి ఉనికి నది కాదు. అది సముద్రం).

స్వామి మాటల్ని ఎంతో శ్రద్ధగా విన్న యువకుడు ధ్యానం ప్రక్రియని చేపట్టాడు. ఎన్నో సంవత్సరాలు గడచిపోయాయి. అదే ఆశ్రమంలో ఇంకా జీవించి ఉన్న స్వామిని ఆడగాల్సిన ప్రశ్నలూ మాయమైపోయాయి. అతడి దగ్గర ఇప్పుడు ఏ ప్రశ్న కూడా మిగిలిలేదు.

*

■ నవరాగం

నిలిచి వెలిగే ప్రేమ కోసం అన్వేషణ

తల్లిలా చూసుకునే స్త్రీని కోరుకుంటాడు మగాడు. అలాగే తండ్రిలా లాలించే పురుషుడ్ని కోరుకుంటుంది స్త్రీ. ఏదీ ఆశించకనే ప్రేమించే లక్షణం ఈ రెండిటిలో వుంటుంది. ఇలాంటి స్వభావం పరస్పరం ఇద్దరు స్త్రీ పురుషుల నడుమ వుంటే వారి జీవితం ధన్యం. కానీ అలాంటి జీవితం ఏ కొందరికో లభ్యం. అడగకనే ఇచ్చిన ప్రేమలోని మాధుర్యం అనంతం. ఇద్దరూ చెప్పకనే ఒకరి పట్ల మరొకరు కనబరిచే అనురాగం అపురూపం.

అర్థం చేసుకోవడంలోనే ఇది ఇమిడివుంది. అర్థం చేసుకోడానికి ముందు ప్రేమించాలి. ఎలాంటి షరతుల్లేకుండా, ఫిర్యాదుల్లేకుండా ప్రేమించాలి. ద్వేషానికీ, అసూయలకీ తావు లేకుండా ప్రేమించాలి. అతని క్షేమమే, సంతోషమే తనకు ప్రధానమన్నంత గాఢంగా ప్రేమించాలి. ఆమె ఆనందమే తన ఆనందమన్నంత భావన మనసులో ఉరకలెత్తాలి. అలాంటి ప్రేమను పొందిన స్త్రీకి జీవితంలో ఏం కావాలి? అలాగే ఆమె సన్నిధి తనకు పెన్నిధిగా భావించే మగాడికి మరింకేం కావాలి? ఏదీ అక్కర్లేని ఒకానొక దివ్యమైన స్థితికి చేరుకుంటే వారి జీవితం అద్భుతం.

నిజంగా ఇలాంటి అద్భుతం జీవితంలో సాధ్యమా?

చిట్టీలు కట్టాలి. రుణవాయిదాలు చెల్లించాలి. అమ్మాయికి కొత్త మొబైల్ కొనాలి. అబ్బాయికి బైక్ ఇప్పించాలి. బీమా పాలసీ కిస్తులు కట్టాలి... వీటన్నిటి నడుమ రోజులు గడిచేనా? గడిచే కాలంలో ప్రేమ నిలిచేనా? నిలిచి వెలిగేనా? అసలు ప్రేమభావనలు లోలోపల తిరుగాడేనా?

ఎంత విచిత్రమైన స్థితి! అంతా బాగున్న వేళ కన్యాకుమారినో, కాశ్మీర్‌నో చుట్టివచ్చిన రోజులు అంతలోనే కరిగిపోతాయి. కబుర్లు ఎన్నో కలబోసుకున్న వారి నడుమ మాటలు కరువవుతాయి. ఇష్టంగా అతని జుట్టులోకి వేళ్ళు జొప్పించి ఆడుకున్న రోజులు గుర్తుకు రావు గాక రావు. రాత్రులు రాగరంజితం కానేకావు. ఇంట సంగీతం వినిపించదు. ఆమె కళ్ళల్లో తొలినాళ్ళ నక్షత్రాలు కనిపించవు. మాటల్లో మాధుర్యం ఒలకదు. ఇంటి లోన్ వాయిదా కట్టలేదన్న ఛీత్కరింపులు నర్మగర్భంగా తొంగిచూస్తుంటాయి. దేహాలు పిడచగట్టుకుపోతాయి. స్పర్శ లెరుగక సంవత్సరాలు పరుగులు దీస్తాయి. నడిప్రాయం ముంచుకువస్తుంది.

తలకు రంగులేయొచ్చు.

వలపుల తలపులు వెలిసిపోయాక కృతక సింగారాలు ఎందుకోసం?

మనుషులు చిత్రమైనవాళ్ళు!

ప్రేమించిన వాళ్ళు, ప్రేమించి పెళ్ళి చేసుకున్నవాళ్ళు

పెళ్ళి చేసుకుని ప్రేమించినవాళ్ళు

ఒకానొక కాలంలో సవ్యంగానే వుంటారు.

ఆర్థికంగా కాస్త అటుఇటు అయిందంటే ఎదుటివారిని నిశ్శబ్దంగా హననం చేయడానికి వెనుకంజ వేయరు. ఆర్థికపరమైన ఒడిదుడుకుల్లో అప్పటివరకు ఊగించి శాసించిన ఉద్వేగాలు చప్పున చల్లారిపోతాయి. ప్రేమానురాగపు జల్లులు ఇంకిపోతాయి.

ఆశించకనే ప్రేమించడమనే భావన అసలు సారం తెలుస్తుంది. ఆస్తులున్నప్పుడు, సంపదలున్నప్పుడు, సంపాదనల్లో తులతూగుతున్నప్పుడే కాదు, ఒడిదుడుకుల్లోనూ కాస్త భుజం ఆసరా ఇవ్వగలిగే ప్రేమ చూపగలగాలి. కానీ కరెన్సీ నోట్ల రెపరెపల్లో ప్రేమను తూచే చోట ఆర్థికమే అంతా శాసిస్తుంది. జాగ్రత్తగా ఉండకపోతే తనకు తానయినా మిగలని స్థితి దాపురిస్తుంది. అందుకే ఉదాత్తమైన ప్రేమభావనల్లో విహరించే ముందు జీవిత కఠోర వాస్తవాలు చూడాలి.

తల్లిలా లాలించాలని కోరుకోవడం తప్పు కాదు. కానీ జీవితపర్యంతం తల్లి పాత్రని పోషించగలిగే స్థితిలో ఇవాళ్టి స్త్రీలు లేరు. అలాగే తండ్రిలా లాలించే పాత్రని కూడా పోషించగల స్థితి మగవాళ్ళకు సైతం లేదు. ఈ వాస్తవాల్ని చూసి ఉద్వేగరహితంగా ప్రేమ సాంద్రతని కొలవాలి. ప్రేమ కన్నా లోకాన మిన్న ఏమీ లేదని కవులు చెబుతారు. కానీ ఆత్మగౌరవంతో బతకగలిగే స్థితి లేనిచోట ప్రేమ నిలబడదు. పరస్పరం ఒకరికొకరు ఆర్థికంగా బరువయ్యే, భారమయ్యే స్థితి లేకుండా జాగ్రత్త పడాలి. ఇది స్త్రీ పురుషులిద్దరికీ అవసరం.

చూపులతో చూపులు కలిపి, కప్పు కాఫీ తాగి ఎవరి దారిన వారు ప్రయాణించడం సులువు. కానీ కలిసి నడిస్తే, సహజీవనం సాగిస్తే తొలినాళ్ళలో కళ్ళల్లో కనిపించిన నక్షత్రాలు ఎల్లకాలం అలాగే నిలిచిపోతాయా అని ఆలోచించాలి. కాలం కాని కాలంలో ఆదాయాల్లో వ్యత్యాసాలు వస్తే ఉరకలెత్తే ఉద్వేగం అలాగే నిలిచి వుంటుందో లేదో తరచి చూసుకోవాలి.

పాతికేళ్ళ వయసులోనే నలభై ఏళ్ళ తర్వాతి జీవితాన్ని దర్శించే దూరదృష్టి కనబరిచే చోట అమ్మాయి కళ్ళలోని ప్రేమ కన్నా ఆమె వెనుక వున్న ఆర్థికపరమైన భద్రతల సౌలభ్యమే భావి జీవితానికి ప్రాతిపదిక అవుతుంది. కవుల కల్పనలు కాదు, జీవితవాస్తవాలు మనుషుల్ని నడిపిస్తాయి. ఈ వాస్తవాల నడుమ నిలిచి వెలిగే ప్రేమ కోసం అన్వేషణే జీవితం!

- ప్రణీత్

> **నువ్వు చెప్పాలనుకుని చెప్పని మాట ఏమిటని పురుషులను అడుగు.**
> **నువ్వు చెయ్యాలనుకుని చెయ్యలేని పని ఏమిటని స్త్రీని అడుగు. - మార్గరెట్ థాచర్**

సోర్స్ కోడ్

కె.ఎక్స్.రాజు

ఆన్‌లైన్ డేటాకు భద్రత కరువు

ఇంటర్నెట్ వినియోగం పెద్దఎత్తున పెరిగిన నేపథ్యంలో ఆన్‌లైన్‌లో డేటా స్టోరేజికి కూడా అధిక ప్రాముఖ్యత పెరుగుతోంది. సమాచారం సాంకేతికత రోజురోజుకు ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. ఇదంతా ఒకవైపు... మరోవైపు ఇంతటి సాంకేతికత వృద్ధి చెందుతున్నప్పటికీ డేటా ప్రైవసీకి మాత్రం తూట్లు పడుతూనే ఉంది. ఆన్‌లైన్ డేటాకు భద్రత కరువవుతోంది. హ్యాకర్లు దొంగిలిస్తూనే ఉన్నారు. వ్యక్తిగత సమాచారం దగ్గర నుండి ప్రభుత్వసంస్థల సమాచారం వరకూ ఏదీ దీనికి మినహాయింపు కాదు. ప్రముఖుల ఈమెయిల్ అకౌంట్లను, ఫేస్‌బుక్, ట్విట్టర్ అకౌంట్లను హ్యాక్ చేసిన సంఘటనలు అనేకం చూస్తూనే వున్నాం. గతేడాది 4,50,000 యాహూ అకౌంట్లు హ్యాకింగ్‌కు గురైన విషయం తెలిసిందే.

తాజాగా గూగుల్‌కు చెందిన దాదాపు 50 లక్షల వినియోగదార్ల అకౌంట్లతో పాటు పాస్‌వర్డ్‌లను సైతం హ్యాకర్లు దొంగిలించినట్లు వెబ్ మీడియాలో వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. మొత్తం 49.3 లక్షల అకౌంట్‌లకు సంబంధించి వినియోగదార్ల ఐడీలు, పాస్‌వర్డ్‌లతో కూడిన డాటాను రష్యాకు చెందిన ఆన్‌లైన్ ఫోరమ్ బిట్‌కాయిన్ సెక్యూరిటీలో (btcsec.com) గతవారం పోస్ట్ చేసినట్లు వార్తలొచ్చాయి. టీవీస్కిట్ అనే యూజర్ నేమ్‌తో ఈ డేటా బిట్‌కాయిన్ ఫోరమ్‌లో అప్‌లోడ్ అయినట్లు సమాచారం. హ్యాకింగ్‌కు గురైన అకౌంట్లలో 60 శాతం అకౌంట్లను ఇప్పటికీ వాడుతున్నారని సదరు డేటాను పోస్ట్ చేసిన వినియోగదారు చెప్పటం ఉత్కంఠకు దారితీస్తోందని ఆ వార్తల సారాంశం. అయితే, ఈ వార్తలను గూగుల్ కొట్టిపారేస్తోంది. తమ కంపెనీ నుంచి వివరాలు అంత సులువుగా లీకయ్యే అవకాశం లేదని చెబుతోంది.

అయితే... ఇందులోని నిజానిజాలు ఏమిటన్నది పక్కన పెడితే, సమాచారాన్ని రహస్యంగా ఆన్‌లైన్‌లో ఉంచడానికి వివిధ సంస్థలు చేపడుతున్న రక్షణ చర్యలపై సందేహాలు తలెత్తుతున్నాయని సైబర్ విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివిధ ప్రభుత్వ వెబ్‌సైట్లలోకి చొరబడి రహస్య సమాచారాన్ని హ్యాకర్లు చోరీ చేశారంటూ వచ్చే కథనాలను చూస్తూనే వున్నాం. ఇటువంటి కథనాన్నే న్యూయార్క్ టైమ్స్ పత్రిక వెల్లడించింది. ఒకటి కాదు... రెండు కాదు... ఏకంగా 120 కోట్ల పాస్‌వర్డ్‌లను, యూజర్‌నేమ్‌లను రష్యన్ హ్యాకర్లు హ్యాక్ చేశారని, దాదాపు 4.20 లక్షల వెబ్‌సైట్ల నుంచి వారు ఈ చర్యకు పాల్పడ్డారని న్యూయార్క్ టైమ్స్ పేర్కొంది. సెక్యూరిటీ లోపాలను గుర్తించే హోల్డ్ సెక్యూరిటీ అనే సంస్థ ఈ భారీ హ్యాకింగ్‌ను వెలుగులోకి తెచ్చింది. అంతేకాకుండా 50కోట్ల ఈమెయిళ్లనూ వారు సేకరించినట్లు చెప్పింది. సైబర్ నేరాల్లో ఇదో రికార్డుగా చెపుతున్నారు.

ఈమెయిల్ హ్యాకింగ్‌కు గురైతే...

ఆన్‌లైన్‌లో సమాచార భద్రత మేడిపండు చందమేనన్నది పై సంఘటనల ద్వారా రుజువవుతోంది. ఈక్రమంలో వెబ్‌సైట్లుగానీ, ఈమెయిల్ అకౌంట్లుగానీ హ్యాకింగ్‌కు గురైతే తక్షణ చర్యలు తప్పనిసరి. దీనికి సంబంధించిన పలు సూచనలను ఆయా ఈమెయిల్ ప్రొవైడర్లు ప్రత్యేక సైట్ ఇన్ఫర్మేషన్‌ను తమ మెయిల్ పేజీలో పొందుపరిచారు. యాహూ, జీమెయిల్, అవుట్‌లుక్ డాట్ కామ్ వినియోగదార్లు ఆయా ప్రొవైడర్ల సూచనలను పాటించాలి. ముఖ్యంగా మన మెయిల్ అకౌంట్ హ్యాకింగ్‌కు గురైతే వెంటనే ఆ సమాచారాన్ని సదరు ఈమెయిల్ ప్రొవైడర్ కస్టమర్ కేర్‌కు ఫోన్ చేసి చెప్పొచ్చు. బంధుమిత్రులకు కూడా ఆ సమాచారాన్నివ్వాలి. లేకుంటే హ్యాకర్లు మీ పేరుతో వారిని కూడా మోసగించే అవకాశం ఉంది. దీంతోపాటు మీ మెయిల్‌కు సంబంధించి పర్సనల్ ఈమెయిల్ సెట్టింగ్స్‌లో ఫార్వోడింగ్ పాలసీలకు సంబంధించిన సెట్టింగ్‌లను పరిశీలించుకోవాలి. ఎందుకంటే... హ్యాకర్లు మీకు వచ్చే మెయిల్స్ వివరాలు తమకు అందేవిధంగా సెట్టింగ్‌లను మార్చే అవకాశం ఉంది. ముఖ్యంగా మీ ఈమెయిల్ అకౌంట్ హ్యాకింగ్‌కు గురైందన్న విషయం తెలిసిన వెంటనే, యూజర్ ఐడీతో పాటు పాస్‌వర్డ్‌లను మార్చుకోవాలి.

వెబ్‌సైట్స్ హ్యాకింగ్‌కు గురైతే...

హ్యాకింగ్ బారిన పడుతున్న ప్రముఖ వెబ్‌సైట్‌లు సైతం సరైన రక్షణాత్మక చర్యలను పాటించకపోవటం వల్లే హ్యాకర్లు సులభంగా ఆయా సైట్లలోకి చొరబడగలుగుతున్నారని స్టాప్‌బ్యాడ్‌వేర్ సర్వే చెబుతోంది. అందువల్ల వెబ్‌సైట్‌లోని సాఫ్ట్‌వేర్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవడంతోపాటు సెక్యూరిటీ వ్యవస్థను బలోపేతం చేసుకోవాలి. క్లిష్టమైన పాస్‌వర్డ్‌లను ఉపయోగించటం ద్వారా హ్యాకర్ల చొరబాటును నిరోధించవచ్చు. అంతేకాకుండా గూగుల్స్ వెబ్ మాస్టర్ టూల్స్‌లో రిజిస్టర్ అయితే మాల్వేర్ దాడులు జరిగిన వెంటనే ఆయా సైట్ల నిర్వాహకులకు నోటిఫికేషన్ అందుతుంది. తద్వారా రక్షణ చర్యలు తీసుకోవచ్చు.

పాస్‌వర్డ్‌లు భద్రంగా ఉండాలంటే...

ఈమెయిల్ అకౌంట్‌లు హ్యాకింగ్‌కు గురైన సమయంలో అనుసరించాల్సిన సూచనలను ఆయా ఈమెయిల్ ప్రొవైడర్లు ప్రత్యేక సైట్ ఇన్ఫర్మేషన్‌ను తమ మెయిల్ పేజీలో పొందుపరుస్తారు. వినియోగదార్లు ఆ సూచనలను తప్పనిసరిగా పాటించాలి.

* ఒకటి కంటే ఎక్కువ అకౌంట్స్ వుంటే... వాటన్నింటికీ ఒకే పాస్‌వర్డ్ కాకుండా వేర్వేరు పాస్‌వర్డ్‌లను ఉపయోగించాలి.
* సైన్ అవుట్ చెయ్యటం మరవకూడదు.
* యాంటీ వైరస్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తుండాలి.
* మీ పాస్‌వర్డ్‌ను ఇతరులతో షేర్ చేసుకోకూడదు.
* వై-ఫై కనెక్షన్లను ఉపయోగించే సమయంలో పాస్‌వర్డ్‌ను ఎంటర్ చేయకూడదు.
* పాస్‌వర్డ్‌లను అప్పుడప్పుడు మార్చుతుండాలి. క్యాపిటల్ లెటర్స్, సింబల్స్, సంఖ్యలతో కూడిన క్లిష్టమైన పాస్‌వర్డ్‌లను ఉపయోగించాలి.

ఏదేమైనప్పటికి హ్యాకింగ్ ముప్పునుంచి బయటపడేందుకు ఆన్‌లైన్ యూజర్లు తరచూ పాస్‌వర్డ్‌లను మారుస్తూ ఉండాలని నిపుణులు చెబుతున్నారు.

రచయిత సెల్ : 9490099219

■ సమీక్షలు



ఒక జంట కవిత్వం

తెల్లారితే... (కవిత్వం)
రచన:కె.విల్సన్‌రావు, కె.ఆంజనేయకుమార్
పేజీలు: 120, వెల: 75/-
ప్రతులకు: ప్రజాశక్తి పుస్తక కేంద్రాలు

కవిత్వం మీద ప్రేమ వున్న ఇద్దరు కవులు కలిసి వెలువరించిన సంకలనం 'తెల్లారితే...'. కె.విల్సన్‌రావు, కె.ఆంజనేయకుమార్‌లు కలిసి జూన్ 2 అర్ధరాత్రి ఈ కవిత్వ పుస్తకాన్ని లోకం మీదకు వదిలారు. 'శైలీశిల్పాల తేడా ఉన్నా కవితా సారాంశంలో మా ఇద్దరి ఆలోచనలు ఒకటే' అని వారి ముందుమాటలో పేర్కొన్నారు. అందుకు తగ్గట్టుగానే వీరి కవిత్వవస్తువులో, నడకలో, నిర్మాణంలో వైవిధ్యం వుంది. 26 కవితలు విల్సన్‌రావు గారు రాసినవి కాగా, ఆంజనేయకుమార్ రాసిన 21 కవితలున్నాయి. ఇద్దరూ సామాజిక పరిణామాలకు ప్రతిస్పందనగా కవిత్వం రాయడంలో పోటీపడ్డారు. నిర్భయ ఘటన నేపథ్యంలో ఇద్దరి కవితలూ పోటాపోటీగా వున్నాయి. ఆ ఘటన నేపథ్యమని ప్రత్యేకంగా చెప్పారు. ఆ ఘటన, అలాంటి ఘటనల నేపథ్యమే స్త్రీల పట్ల గౌరవంతో, సంవేదనతో వారు రాసిన కవితలు ఈ పుస్తకానికి నిండుదనం ఇచ్చాయి. కవితని ఎత్తుకోవడంలో, నడిపించడంలో ఎవరి శైలి వారిదే. కవితని మరింత సుబోధకం చేయడానికి ఆంజనేయకుమార్ ప్రయత్నిస్తారు. ఎక్కువ ఉపమానాలుంటాయి. వివరణలుంటాయి. అయితే వాటి అభివ్యక్తిలో సౌందర్యం తొణికిసలాడుతుంటుంది. కనుక ఔచిత్యభంగం కలగదు.

విల్సన్‌రావు క్లుప్తతకు ప్రాధాన్యమిస్తారు. భాషలో ప్రయోగాలు చేస్తారు. 'ధిక్కా'రమై అన్న శీర్షికనే ఇందుకు ఉదాహరణ. సూటిగా, పదునుగా ప్రశ్నించే ధోరణి కవిత్వంలో తొంగి చూస్తుంటుంది. సున్నితమైన వ్యక్తీకరణలు ఆకర్షణీయంగా వుంటాయి. ఇద్దరి కవిత్వమూ వస్తుశిల్పాల్లో నైర్మల్యాన్ని ప్రదర్శిస్తాయి. కవిత్వవిలువల్లో ఉదాత్తతకు ప్రాధాన్యమిస్తాయి. తెలుగువారికి రెండు రాష్ట్రాలు ఏర్పడిన సందర్భంలో రాసిన ఈ కవిత్వం ప్రత్యేకంగా చదవాలి.

రాయలసీమ జీవితాన్ని ప్రతిఫలించిన కథలు

తెలుగు కథాసాహిత్యంలో రాయలసీమకు ఒక విశిష్టత వుంది. ఈ ప్రాంతం నుంచి ఎక్కువగా కథాసాహిత్యం వచ్చింది. తెలుగు కథలో సీమది ప్రత్యేకపాయ. ఈ ప్రత్యేకతని చేకూర్చినవారిలో ఒకరయిన రచయిత శాంతి నారాయణ. సీమ ప్రాంత జీవితాన్ని సజీవమైనరీతిలో కథల్లో చిత్రిస్తున్నారాయన. వారి తాజా కథల సంపుటి 'పల్లేరుముళ్లు'. ఈ పుస్తకంలో పదిహేను కథలున్నాయి. రాయలసీమ పల్లెల్లోని జీవన వైవిధ్యాన్ని ఈ కథల్లో చిత్రించారు. పల్లెల వాతావరణాన్ని, మనుషుల స్వభావాల్ని వాస్తవికంగా చిత్రిస్తారు రచయిత. సీమ ప్రాంతానికే ప్రత్యేకమైన యాస పరిమళం కథల నిండా దోబూచులాడుతుంది. నీళ్ళు లేక, వర్షాలు రాక, మబ్బుల్ని నమ్ముకొని బతకలేక అవస్థలు పడే సీమ ప్రజల సమస్యల స్వరూప స్వభావాల్ని అర్థం చేసుకోవాలంటే ఈ కథలు చదవాలి. 'మట్టి మరకలు, తాలుగింజలు, గర్భస్రావం, దళారి, రొంపి, మట్టిమనుషులు' మరల మరల చదవాలి. రెండు మూడు దశాబ్దాలుగా రాయలసీమ ప్రాంతంలోని పరిస్థితుల్ని, అక్కడి సమాజంలో వచ్చిన పరిణామాల్ని శాంతినారాయణ కథలు ప్రతిఫలించాయి. ప్రత్యేకించి అనంతపురం జిల్లాలోని పరిస్థితుల నేపథ్యంలోంచి ఈ కథలు వచ్చాయి. స్థానికత ఆధారంగా సమాజాన్ని అధ్యయనం చేసేవారికి మంచివనరుగా ఉపకరించే పుస్తకమిది.

పల్లేరు ముళ్లు (కథలు)
రచన: శాంతి నారాయణ
పేజీలు: 260,
వెల: రూ. 170.
ప్రతులకు:
విశాలాంధ్ర పుస్తక కేంద్రాలు

మీరూ రాయండి

మీరు చదివిన వాటిలో మీకు బాగా నచ్చిన పుస్తకం గురించి ఈ శీర్షికకు రాసి పంపండి. మీ ఫొటో కూడా జతచేయండి. పుస్తకంలో మీకు నచ్చిన అంశాల గురించి రాయండి. పుస్తకం ఎందుకు నచ్చిందో ఒకటీ రెండు మాటల్లో చెబితే మంచిది. 'నాకు నచ్చిన పుస్తకం' శీర్షికన ప్రచురిస్తాం. మీ అభిప్రాయాలు చేరాల్సిన చిరునామా:

సోపతి,
ప్రజాశక్తి ఆదివారం సంచిక,
ప్లాట్ నెం.21/1,
ఎం.హెచ్.భవన్,
ఆజమాబాద్,
ఇండస్ట్రియల్ ఏరియా,
బాగలింగంపల్లి,
హైదరాబాద్-500030.

గమనిక

➠ సమీక్షకోసం పుస్తకాలు పంపే రచయితలు, ప్రచురణ కర్తలు రెండు ప్రతులు పంపించాలి.

➠ రచయితలే సమీక్షలు రాయించి పంపకూడదు.

➠ పుస్తకాల మీద సమీక్షలకు సంబంధించి సంపాదకులదే తుది నిర్ణయం. ఈ అంశంపై ఉత్తర ప్రత్యుత్తరాలకు, ఫోన్లలో సంప్రదింపులకు తావు లేదు.

చిరునామా:
సోపతి,
ప్రజాశక్తి ఆదివారం సంచిక,
ప్లాట్ నెం.21/1,
ఎం.హెచ్.భవన్,
ఆజమాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా,
బాగ్‌లింగంపల్లి,
హైదరాబాద్-500030.

యాకూబ్ కవితా విశ్లేషణ

నదీమూలం లాంటి ఆ ఇల్లు
యాకూబ్ కవిత్వం
వెల:100/-, పేజీలు: 153
ప్రతులకు : విశాలాంధ్ర, ప్రజాశక్తి, నవోదయ, దిశ హైదరాబాద్. మరియు పెన్నేటి పబ్లికేషన్స్,కడప



'నీటిలో తారా వుండదు
నింగిలో చేపా వుండదు
నీటికీ నీరే పుట్టదూ
నీకు నీ బాధే తప్పదూ...!'

మనలో చాలామంది గత స్మృతుల్ని గుర్తు చేసుకొని, గతించిన ఒక కాలాన్ని మళ్లీ పట్టుకోడానికి పడే ఆరాటాన్ని తాకడం.. అంతే అందంగా ఆ భావాల్నీ, అక్షరాల్నీ కవి యాకూబ్ అలా అలవోకగా అల్లేశారు తన 'నదీమూలంలాంటి ఆ ఇల్లు..' గురించి..! ఎవరికైనా బాల్యం సుందరమైన స్వప్నం..మధురమైన గీతం. ఒక్కోసారి గత చరిత్ర వెనక్కి తిరిగి చూసుకుంటే..అదిప్పుడు అంత అందంగా లేదని దు:ఖం తెరలు తెరలుగా పొరలి వస్తుంది. అందునా కనిపెంచిన అమ్మ మమకారం.. బిడ్డల్నందరినీ తీర్చిదిద్దడానికి నాన్న పడిన తపన గుర్తొస్తే, ఆ 'జ్ఞాపకాలెంత మధురమో..! అదో తీయని బాధ. గుండెను మెలిపెడుతూనే వుంటుంది. అదో కమ్మని కథ.. ఎప్పుడూ అవే కలలు. చిన్నప్పటి ఆ దొంతరలన్నింటినీ తన అక్షరాలతో కూర్చి, మనల్ని ఓ దగ్గర కట్టిపడేసి.. గుండెను చిక్కబట్టుకొని.. రగిలే ఆవేదనతో.. నీరు నిండిన కళ్లతో ఆ కవిత్వాన్ని మనల్ని చదివించేయడం చూస్తుంటే యాకుబ్‌కేదీ అసాధ్యం కాదు..కాదు..అనిపిస్తుంది. ఎందుకంటే చెప్పదలచుకున్నది చెప్పకపోతే అది గొంతులోనే వుండిపోతుంది. అస్తమానం మనసును తొలిచేస్తూ వుంటుంది. కానీ కవి యాకూబ్ 'ఉవ్వెత్తున ఎగిసే కెరటం...' అందుకని అతని అక్షరాల్లో చితికిన మనసు మనక్కూడా కనిపిస్తుంది. రగిలే గుండెచప్పుడు వినిపిస్తుంది. ..భావాల్లో నిప్పురవ్వలూ.. వెన్నెల్లాంటి సున్నితత్వం అగుపిస్తుంది. అందుకే ' యాకూబ్ కడిగిన ముత్యం. గుండెలో మంటనీ

కడుపులో బాధనీ
కన్నీళ్లతో కడిగేస్తాడు.
అక్షర సత్యాల్ని
ఏరేస్తాడు ..విసిరేస్తాడు..ఒదిగిపోతాడు
మనల్ని గతంలో ముంచెత్తి
తాను మాత్రం తెలి మబ్బులపై తేలిపోతాడు..
జీవితంలో చిక్కదనాన్ని అధిక
చక్కగా చెప్పడమెలానో.. 'చెల్లెలి ఫోన్లో..'
'కళ్లు చెమ్మగిల్లినా... చదవకుండా వుండలేం..
కాపురం నిలబడాలని కలగజేసుకోకుండా
కాలానికే వదిలేసిన
నాలాంటి మర్యాదస్తులదా?
తనలో తానే సమాధాన పడుతూ
సముదాయించుకుంటూ
అన్నీ భరిస్తూ నోరెత్తకుండా
జీవితాన్ని కొంచెం కొంచెం
జరిపేస్తున్న తనదా?..' తోడబుట్టిన చెల్లెలి కాపురం చక్కదిద్దాలనే తపన.. కుదుటపడటానికి చేసిన ప్రయత్నాలన్నీ ఆవిరైపోయిన నిర్లిప్తత.. ఎంతోమంది అన్నయ్యలను కుదిపేసే నగ్నసత్యం కనిపిస్తుంది. అందుకే అంటాడాయన..'అనుకుంటాం కానీ, అన్ని సమస్యలూ, ఆవేదనలకూ పరిష్కారాలు ఒకేలా వుండవు కాక వుండవేమో?!'

'దండం, ప్రణామం, సలాం..!' చూడండీ.. ప్రతి ఒక్కరికీ ఏదో సందర్భంలో ఇలాంటి పరిస్థితి నిజంగా ఎదురయ్యే వుంటుంది. పరిచయస్తులు తారసపడినపుడు ' పలకరించినా గుర్తురానట్లు,

ఎరిగినా ఎరగనట్లు మరీ చెప్పించుకుని,
అపుడపుడూ తప్పించుకుని మొత్తానికి
నిన్ను నువ్వే
ప్రత్యేకంగా ప్రతిష్టించుకునే నిపుణతకు
ప్రణామం
నాకనిపిస్తుంది, పేపర్‌మీది
నాలుగు రాతల్తో కరపత్రంగా
మిగలడం తప్ప, నిజంగా
హృదయంతో కరచాలనం చేయడం

నీకేనాటికైనా అనుభవంలోకి వస్తుందా అని?!

ఇది నిష్టూరం కాదు. నిజంగా నిజం.! ఎవరికైనా ఆ క్షణంలో చాలా బాధగా వుంటుంది. కానీ మన భావాలనూ ఆత్మీయంగా 'కరచాలనం' ద్వారా పంచుకున్న ఆ నిముషం మంచులో తడిసిన గులాబీలా ఓ మృదువైన జ్ఞాపకం మదిలో మెరుస్తూనే వుంటుంది. అందుకే మనం ఎన్ని రాతలు రాసుకున్నా అది ఓ కరపత్రంగా మిగిలిపోతుందని యాకూబ్ కరకుగా వ్యక్తం చేస్తారు.

ఇక 'లోపలి పరుగు' గురించి.. మనలోపలి మనిషి బయటకొచ్చేయాలి. సగటు హైదరాబాదీ నిత్య గొణుగుడూ సణుగుడూనూ.

ట్రాఫిక్‌జామ్‌లో తీరిక చేసుకుని మరీ...'తాళం వేశానా, లేదా? గీజర్ స్విచ్ కట్టేశానా, పాలగిన్నె ఫ్రిజ్‌లో పెట్టానా, అవునూ- ల్యాప్‌టాప్‌లో లాగౌట్ అయ్యానో లేదో, ఫేస్‌బుక్ అలానే వుంచేసానా? అదే సమయంలో వారంనిండా 'ఆదివారం కల..' బిజీషెడ్యూల్లో విసిగిపోయిన ఆశాజీవిపై చల్లని నీటి తుంపరలాంటి ఆదివారాన్ని ఆస్వాదించాలనేది అభిలాష. పిసరంత దబాయింపూనూ. కాదనలేనిది.

'కవిత్వంతో మాటా ముచ్చట..!'లో కాదేదీ కవితకు అనర్హం స్ఫురిస్తుంది..

'నావైపు చూడు..'
ఇప్పుడే కళ్లు తెరిచాను నిన్నెలా గుర్తుపట్టడం
అలా పరిగెత్తుతున్న మబ్బు
కిక్కిరిసిన రోడ్లు, విరిగిపోతున్న కాలం,

కాలుతున్న ఎడారులు, రాలుతున్న పూలు, కూలుతున్న మనిషి, ఎరితీతకు ఎదురుచూస్తూ ఇనుపచువ్వల వెనుక మార్మోగుతున్న పాట, నినదిస్తున్న గొంతు, నిద్రిస్తున్న, నటిస్తున్న రాజ్యం, ఓట్లలోకి బట్వాడా అవుతున్న ఖనిజం, లేచి పడుతున్న , పడిలేస్తున్న ఉద్యమం, రూపం మార్చుకుంటున్న మిత్రశత్రువు, మిణుకుమిణుకుమంటున్న ఆశ, దగ్ధమవుతున్న భవిష్యత్తు, చూస్తూనే వుండు" ఒకదగ్గర చెప్తారు..

నా నుంచి నువ్వు
దృష్టి మరల్చినప్పుడల్లా
అలిగి భూమిమీద ఏడుపు
గొంతుతో పొర్లాడతాను.' అంటే తనలో
ప్రతీ బిందువూ
కవిత్వమే.. అనే కదా..!

ఈ కవితా సంకలనంలో మహాప్రవాహం 'నదీమూలంలాంటి ఆ ఇల్లు!'

చిన్ననాటి ఇంటికి చాలా సందర్భాల్లో వెళ్లలేకపోవడం.. 'అంతే లేని, చింతే విడని జ్ఞాపకం' అంటారు. 'వాకిట్లో ఎదుగుతున్న కొడుకులాంటి వేపచెట్టు..' అనడంలో తాత్పర్యం అమ్మానాన్నలకు అందొచ్చిన కొడుకు వున్నా.. వేపచెట్టులో'చేదంత'.. అనేనా..??

ఈ నవనాగరిక సమాజంలో చుట్టూ అన్నీ వున్నా.. ఏమీ లేనట్టే.. అందొచ్చిన బిడ్డలు ఎక్కడో బతుకుబాటలో దూరంగా వుండిపోయి.. అమ్మానాన్నల్ని అక్కున చేర్చుకునే గడియలు బహు అరుదై.. బతుకు బరువై భారంగా కాలం వెళ్లదీస్తున్న చేదు నిజాలెన్నో.. ఆ జ్ఞాపకాలన్నీ గరళం మింగినంత కఠోరమే.. అయినా మింగుడు పడని స్థితి నుండి ఎక్కడో దూరపుకొండలు నునుపు చూసి దొరకని ఆనందం కోసం తాపత్రయం. ఒక్క మాటలో చెప్పాలంటే.. మానవ సమాజంలోని ఇటువంటి చేదు గుళికలకు మానవీయతనే చక్కెరను బహు కమ్మగా పూసి మింగించే భావ జాలం యాకుబ్ సాహిత్యంలో ఇమిడి వుంది. వాస్తవ జీవితాలను సామాజిక దృక్కోణంలో చూడగలిగిన స్పృహ వుండటం వల్లే తనదైన ప్రత్యేకత ఆ శైలిలో తీర్చిదిద్దారు. అందుకే తనకంటూ సాహితీ మిత్రుల సంపద కూడా కూడబెట్టారు. అతని సాహితీ తోట మరింత పరిమళించాలనీ..మరెన్నో సుమాలు వికసించాలనీ.. అభిలషిద్దాం..!

- జి.రాజకుమారి, 9490099008

■ ఈ వారం కవిత్వం

చలిలో...

షేక్ కరీముల్లా

చలి
బాబోయ్ చలి
మనసును కప్పేసిన చలి
నిద్రల్ని మాయం చేసిన
మాయదారి రాజ్యంలా చలి
చలిలో...
ఏదీ వికసించదు
ఏదీ పరిమళించదు
తడిసి ముద్దయిన తుమ్మెదలా
ఝుంకారాన్ని మరిచి
ఝుంఝూటంలో పడ్డ జిందగీ
గూటిలో రొప్పుతున్న గువ్వలా
గుండెలు కొట్టుకుంటున్నాయి
చలి కర్ఫ్యూ ప్రకటించింది
చలి కాళరాత్రయ్యింది
చలి కాలనాగయ్యింది
అప్పుడప్పుడు...
కాళ్లకు చెప్పుల్లేని పిల్లలెవరో
చలి మంటలై జ్వలిస్తుంటారు
అడవుల్లోంచి పర్వతాల్లోంచి
సూర్యుడ్ని దివిటీల్లో మోస్తూ
విరుచుకుపడ్తూ, విరిగి పడ్తూ
చలిని చుట్టుముడ్తారు
చలిలో చన్నీటి స్నానం చేసి
చలికే సవాల్ విసుర్తారు
చలితోక తొక్కి
చలి పడగలపై నాట్యం చేస్తారు
ఐనా...
వణుకుతూ, గొణుగుతూ
పాడు చలికాలమంటూ తిట్టుకుంటూ
ఎన్నాళ్లు ముడుచుకుంటాం
ఎన్నేళ్లు జడుసుకుంటాం
ఏదైనా ఇట్టే దొరకదు
కాసిన్ని ఎండు పుల్లలు ఏరుకోనిదే
ఎండిన పొయ్యినీ రాజెయ్యలేం
ఎండిన పేగుల్నీ నింపలేం
చలి మొదలయ్యాకే
ఉద్యమం ఇల్లాలిగా గుర్తుకొచ్చింది
ఉద్యమం బిగి కౌగిలిలోనే
వెచ్చదనం విలువేమిటో తెల్సింది
పొలాల్లో వరికోత కోస్తూ
ఎంకిపాటైన సాదాసీదా పల్లెపిల్లల్లా చెరిపేసి
చలి ఛందస్సును
అక్షరం వెచ్చని కిరణమై విస్తరించాల్సిందే
అడుగడుగు పునర్నిర్మించాల్సిందే
చలిని చీల్చుకుంటూ
ఆజా విన్పిస్తోంది

సెల్ : 9441502990

నా అక్షరం

అక్షరం ముక్క పగిలినా నాకు ఆనందమే
ప్రతి ముక్క ఓ కావ్యమవుతుంది
ఓ కథ అవుతుంది
ఒక అక్షరం ముక్క వేల సూర్యుళ్లతో సమానం
ఎప్పుడలా?
జనం కొరకు కాంతివంతమయినప్పుడు
అక్షరం ముక్క పగిలినప్పుడు
విశ్వం విస్ఫోటనమయినప్పుడు వినిపిస్తుంది
అక్షరమంటే సామాన్యమా?
ఆకాశం భూమి ఓ అడవి ఓ సాగరం
ఓడిపోని ఓ సూర్యుడు తల వంచని వీరుడు
ఎప్పుడు?
జనం కొరకు పాటగా మారినప్పుడు
అక్షరం నా తోడూ నీడా
అక్షరం నా ఆనందం నా ఆర్తనాదం
అక్షరం ఓ కన్నీరు ఓ వెన్నెల

కోట్ల నక్షత్రాలు ఎక్కడివి
అక్షరం నుండి ఉద్భవించాయి
ఎప్పుడు
జనం కొరకు ఆయుధమయినప్పుడు

- సిహెచ్.మధు, 9949486122

అతి పెద్ద లైబ్రరీ

ఇంత పెద్దగా ఉంది... ఇదేమైనా ఆడిటోరియం అనుకుంటే మీరు పొరపాటు పడ్డట్టే. ఇది ప్రపంచంలోనే అతి పెద్ద లైబ్రరీ. లండన్‌లోని బ్రిటీష్ లైబ్రరీ ఇది. ఇందులో 170 మిలియన్ల పుస్తకాలు ఉన్నాయి. సంవత్సరానికి 1.75 మిలియన్ల మంది ఈ లైబ్రరీని ఉపయోగించు కుంటున్నారు. ఇందులో 1977 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈ లైబ్రరీకి అయ్యే ఖర్చు ఎంతో ఊహించగలరా... 141 మిలియన్ డాలర్లు.

పుస్తకాలు చదవడం వల్ల ఎన్నో విషయాలు తెలుస్తాయి. మనం చదివే వాటిలో చాలా విలువైన సమాచారం ఉంటుంది. చదివేటప్పుడు ఎంతో ఆసక్తితో చదివి, తర్వాత వాటిని ఎక్కడ పడితే అక్కడ పెట్టేస్తుంటాం. భద్రపరుచుకోవడం పెద్ద సమస్య. ఇక్కడున్న పుస్తకాల అరలు చూడండి... పుస్తకాలను నీట్‌గా పెట్టుకోవడానికే కాదు, కూర్చోని చదువుకోడానికి కూడా వీలుగా ఉన్నాయి. వీటికి ఎక్కువ స్థలం కూడా అవసరం లేదు. కూర్చున్నచోటు నుండి కదలకుండానే ఇష్టమైన పుస్తకం తీసి చదువుకోవచ్చు. పూర్తవగానే తిరిగి అక్కడే పెట్టేయొచ్చు.